
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 09.08.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 10 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

శుభాకాంక్షలు పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు.



## రాజకీయ శక్తులేగాని రాజ్యాంగ శక్తులు కాని సోనియా, దిగ్విజయ్‌సింగ్‌లు రాష్ట్రాన్ని తగలబెట్టారు



# రాష్ట్రం కాష్టమైంది

భారతదేశం ఇంత ఘోరంగా తయారవుతుందేమిటి? భారత రాజకీయ వ్యవస్థ ఇంత దారుణంగా మారిందేమిటి? మన దేశాన్ని రాజ్యాంగశక్తులు నడిపిస్తున్నాయా? రాజకీయ శక్తులు నడిపిస్తున్నాయా? బ్రిటీష్‌వారితో పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకుంది స్వతంత్రంగా పాలించుకోవడానికా? ఈ దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల సెంటిమెంట్లు, ప్రాంతాలతో అనుబంధాలు వంటి వాటి గురించి ఏమీ తెలియనివారికి, అసలు తమ వ్యక్తిగత జీవితంలో సెంటిమెంట్‌కే స్థానంలేని వారికి దేశ పాలనా బాధ్యతలు అప్పగిస్తే దేశాన్ని ఏ విధంగా తగలబెడతారో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాము.

ఆంధ్రప్రదేశ్ విభజనను కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకులు దిగ్విజయ్‌సింగ్ ప్రకటించారు. వీరి ప్రకటనతో ఆంధ్రప్రదేశ్ భగ్గుమండింది. రాష్ట్రానికి రాష్ట్రమే తగలబడిపోతుంది. జనజీవనంతో పాటూ వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలన్నీ స్థంభించిపోయి రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు వేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. సోనియా, దిగ్విజయ్‌సింగ్‌లు చేసిన పనికి (మిగతా 10వ పేజీలో)




# అంతా హైదరా'బాధే'

సీమాంధ్రులు సమైక్యాంధ్రప్రదేశ్‌ను కోరుతున్నా, తెలంగాణ వాదులు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరినా దానికి మూలం రాజధాని నగరం హైదరాబాదే! ఇప్పుడు రెండు ప్రాంతాల ఉద్యమాలన్నీ కూడా హైదరాబాద్‌ను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్నవే! హైదరాబాద్ లేకుండా తెలంగాణ ఇస్తామంటే తెలంగాణవాళ్లు అసలు ప్రత్యేకరాష్ట్రమే వద్దంటారు. హైదరాబాద్ లేకుండా తెలంగాణ ఇచ్చేటనయితే సీమాంధ్రులకు ఎటువంటి సమస్యలేదు. (మిగతా 10వ పేజీలో)

• విభజనలో...

# అందరూ పాత్రధారులే!

## తిలాపాపం తలా పిడికెడు...



తెలిసో తెలియకో రాష్ట్ర విభజనలో ప్రతి పార్టీ పాలుపంచుకుంది. తెలుగు జాతిని రెండుముక్కలు వేయడంలో ప్రతి రాజకీయపార్టీకి భాగముంది. తెలంగాణ విషయంలో రాజకీయ ప్రయోజనాలనాశించి ప్రతి పార్టీ డ్రామా ఆడింది. ఈ డ్రామాను అర్థంపెట్టుకునే కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రాన్ని అడ్డంగా నరికింది. కాంగ్రెస్‌పార్టీ విభజన సాహసం చేయదులే అని మిగతాపార్టీలు వేసుకున్న అంచనాలను ఆ పార్టీ తలక్రిందులు చేసింది. తన స్వలాభం కోసం రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకుని అన్నిపార్టీలు కోరాయి కాబట్టే తెలంగాణను ప్రకటించామని తేల్చేసింది. విభజన పాపాన్ని అన్ని పార్టీలకూ అంటగట్టింది.

తెలంగాణ సమస్య కాంగ్రెస్, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలకు ముందు నుయ్యి వెనుక గొయ్యి మాదిరిగా వుండింది. కేంద్రంలో అధికారంలో వున్నది కాంగ్రెస్సే కాబట్టి నిర్ణయం తీసుకోవాల్సింది వాళ్లేనని, తెలంగాణపై (మిగతా 10వ పేజీలో)

# ఈ జన్మకు ఇది చాలు!

(వివరాలు 12వ పేజీలో)



ఈ నెల 4వ తేదీన నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన డా॥బెజొరె అవార్డు ప్రదానోత్సవ సభలో 'రామోన్ మెగసెసే' అవార్డుగ్రహీత శాంత సిన్హాను 'బెజవాద గోపాలరెడ్డి అవార్డు'తో సత్కరిస్తున్న మాజీశాసనసభాపతి అగరాల ఈశ్వరరెడ్డి, జె.వి.రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బి.వి.నరసింహం, తుంగా శివప్రభాత్‌రెడ్డి






**కాంగ్రెస్ తీసుకున్న రాష్ట్ర విభజన నిర్ణయంతో సమైక్యాంధ్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగుస్తోంది. పదవులే ప్రాణంగా బతికే నాయకులు తమ నియోజకవర్గాలలో జరుగుతున్న ప్రజాఉద్యమాలకు తలొగ్గి రాజీనామాలు చేసారు. కానీ సీమాంధ్రకు చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు మాత్రం రాజీనామాల విషయంలో దొంగనాటకాలేస్తున్నారు. పదవులకు వదులుకోవాలంటే వీరికి ప్రాణాలు వదులుకున్నట్లుగా వుంది.**



నెల్లూరుజిల్లాకు చెందిన వారు గతంలో 9మంది ఎంపీలుగా వుండేవారు. ఇప్పుడు



## మన ఎంపీల...
# మౌనంతో పోయిన మానం



ఒకరు తగ్గి 8మంది వున్నారు. ఇంతమంది వుండి కూడా జిల్లాకు వీరుచేసిన ప్రత్యేకఅభివృద్ధి అంటూ ఏమీ లేదు. ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా వెంకయ్యనాయుడు అంతోఇంతో పనిచేసాడు తప్పితే ఇంకెవరూ జిల్లాను పట్టించుకున్న పాపానపోలేదు. శ్రీకాళహస్తి-నడికుడి వంటి ప్రాధాన్యతకలిగిన రైలు మార్గం విషయంలో కూడా వీరు ఒక్కటిగా కృషి చేయలేదు. ఇప్పుడు జరుగుతున్న సమైక్యాంధ్ర ఉద్యమం లోనూ వీరిది తలోదారి అన్నట్లుగా వుంది. బీజేపీకి చెందిన రాజ్యసభసభ్యులు యం.వెంకయ్యనాయుడు తమ పార్టీ సిద్ధాంతం ప్రకారం తెలంగాణకు మద్దతు పలికారు. ఈ ఉద్యమంలో ఆయన పాత్ర ఏమీ వుండదు. తిరుపతి ఎంపీ చింతామోహన్ సమైక్యాంధ్ర ఉద్యమానికి దూరంగా వుంటున్నారు. విభజన నిర్ణయానికి నిరసనగా రాజీనామా చేద్దామనే ఆలోచనలో కూడా లేదు. రాజ్యసభసభ్యులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనారోగ్యంతో ఏమీ చేయలేని పరిస్థితి. నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాత్రం రాజీనామా చేసారు. నెల్లూరు ఎంపీగా వచ్చిన తర్వాత ఆయన చేసిన మొదటి మంచిపని ఇది. ఆయన కాంగ్రెస్‌లో వుండుంటే ఆ రాజీనామా కూడా చేసివుండేవాడు కాదు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి స్పందించిన తీరు అంతంతమాత్రంగానే వుంది. తన నియోజకవర్గంలో ప్రజలకు కంటితుడుపుగా ఆయన రాజీనామా ప్రకటన చేసారు. కేంద్రమంత్రిగా వున్న పనబాక లక్ష్మి విభజన విషయమై కనీసం ఖండించను కూడా లేదు. రాజీనామా వూసే ఎత్తలేదు. అధిష్టానానికి నిరసన తెలిపే ప్రయత్నం కూడా చేయలేదు. విజయవాడ ఎంపీ లగడపాటి రాజగోపాల్ నెల్లూరీయుడే! గతంలో సమైక్యాంధ్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆయన ఈమధ్య చప్పబడిపో యాడు. రాజ్యసభసభ్యులు టి.సుబ్బరామిరెడ్డి రాజీనామా చేసి ఢిల్లీ స్థాయిలో మంతనాలు సాగిస్తున్నారు తప్ప ఉద్యమంలో కీలకంగా కనిపించడంలేదు. సమైక్యాంధ్ర ఉద్యమంలో మన ఎంపీల పాత్ర నామమాత్రమే!

## పంచాయితీపోరులో



# హీరోలెవరు? జీరోలెవరు?

పంచాయితీ ఎన్నికలు ముగిసాయి. సీమాంధ్ర ఉద్యమం లేకపోయి వుంటే ఈ పంచాయితీలలో గెలుపోటములపై పెద్ద చర్చేవుండేది. పంచాయితీ తుదివిడత పోలింగ్ జరిగేనాటికే తెలంగాణ చిచ్చుపెట్టి వుండడంతో ఈ ఎన్నికల గెలుపోటములు తెరమరుగయ్యాయి.

జిల్లాలో మూడువిడతలుగా పంచాయితీ ఎన్నికలు జరగ్గా వైకాపా మొదటిస్థానంలో, కాంగ్రెస్ రెండోస్థానంలో, తెలుగుదేశం మూడోస్థానంలో నిలిచాయి.

ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తన పట్టు నిలుపుకున్నాడు. ఇక్కడ ఎక్కువ పంచాయితీలను అధికార కాంగ్రెస్‌పార్టీ దక్కించుకోగా వైకాపా రెండోస్థానంలో నిలిచింది. తెలుగుదేశం మాత్రం పరువు పోగొట్టుకుంది. ఉదయగిరిలో వైకాపా ఎమ్మెల్యేగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పరువు దక్కించుకున్నారు. నియోజకవర్గంలో వైకాపాకు అధికస్థానాలు దక్కాయి. తెలుగుదేశం ఇన్‌ఛార్జ్‌గా బొల్లినేని రామారావు కూడా ఇక్కడ గట్టిపోటీనిచ్చి తన మద్దతుదారులను పెద్దసంఖ్యలోనే గెలిపించుకోగలిగారు. ఇక్కడ కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. కావలిలో తెలుగుదేశం, వైకాపాల మధ్యే ప్రధానపోటీ (మిగతా 10వ పేజీలో)








## ఉద్యమానికి మొదటి చిరునామా...
# రాజీనామా

**ప్రజల మనోభావాలకు ప్రతినిధులు ప్రజాప్రతినిధులు. చట్టసభలకెళ్లి ప్రజలంతా తమ బాధను చెప్పుకోలేరు. ప్రజల బాధలను, వారి భావాలను ప్రతిబింబించాల్సింది ప్రజాప్రతినిధులే! సమైక్యాంధ్ర ఉద్యమం విషయంలో నెల్లూరుజిల్లా ప్రజాప్రతినిధులంతా తమ బాధ్యతలను రాజీనామాలతో నెరవేర్చారు.**

2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన వెలువడిన వెంటనే జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలందరూ రాజీనామాలు చేసారు. ఆరోజు ఊహించని స్థాయిలో సీమాంధ్ర ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలంతా రాజీనామాలు చేసేసరికి కేంద్రప్రభుత్వం దిగొచ్చి తెలంగాణ ప్రకటనను వెనక్కితీసుకుంది.

మళ్లీ ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగింది. విభజన ప్రకటన రాకముందే వైకాపా ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు రాజీనామా చేసారు. విభజన ప్రకటనతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తర్వాత ఆనం వివేకానందరెడ్డి రాజీనామా చేయడం జరిగింది. తెలుగు దేశం ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, కురుగొండ్ల రామకృష్ణ, బల్లి దుర్గాప్రసాదరావు, పరసారత్నంలు కూడా రాజీనామా చేసారు. ఇక నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కూడా రాజీనామా చేయగా, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాజీనామాకు సిద్ధంగా వున్నారు. సమైక్యాంధ్రకు మద్దతుగా జిల్లా ప్రజాప్రతినిధులు చేసిన రాజీనామాలు ఉద్యమానికి మరింత ఊపుతెచ్చాయని చెప్పవచ్చు.







## ఒంగోలు రాజధాని అయితే...
# నెల్లూరు సుడి తిరిగినట్లే!



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలైనట్లే! హైదరాబాద్‌ను ఇక సీమాంధ్రవాళ్లు నమ్మే పరిస్థితి లేదు. ఒకవేళ ఉద్యమాలకు తలొంచి కేంద్రం హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిని చేసినా, లేదా కేంద్రపాలిత ప్రాంతం చేసినా సీమాంధ్రకు చెందినవాళ్లు ఇక హైదరాబాద్‌లో పెద్దగా పెట్టుబడులు పెట్టకపోవచ్చు. అదే సమయంలో సీమాంధ్రలో ఒక కొత్తనగరాన్ని మాత్రం హైదరాబాద్‌కు ధీటుగా, ప్రత్యామ్నాయంగా తయారుచేసుకోవాలి. రాష్ట్ర విభజన ఓ పాతికేళ్ల క్రితమే జరిగివుంటే ఇప్పటికే సీమాంధ్రలో ఆ స్థాయి నగరం ఏర్పడి వుండేది. భౌగోళికంగా హైదరాబాద్ సీమాంధ్రలో కలవదు కాబట్టి ప్రత్యామ్నాయంగా మరో నగరాన్ని అభివృద్ధి చేసుకోవడం ఉత్తమమని మేధావుల అభిప్రాయం.

సీమాంధ్రకు కొత్త రాజధాని ఎక్కడ? అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. కర్నూలు, ఒంగోలు, గుంటూరులు పరిశీలనలో వున్నట్లు దిగ్విజయ్‌సింగ్ చెప్పాడు. ఈ మూడు ప్రాంతాలను తీసుకుంటే ఒంగోలుకే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. ఒంగోలులో రాజధాని అంటే నెల్లూరుజిల్లా దశ తిరిగినట్లే! రాజధానిగా ఒంగోలు ఎంత అభివృద్ధి చెందుతుందో, అదేస్థాయిలో నెల్లూరు అభివృద్ధి చెందడం ఖాయం. పేరుకు ఒంగోలు రాజధాని అయినా ప్రకాశం-నెల్లూరుజిల్లాల అనుసంధానంగానే కొత్త రాజధాని నిర్మాణం కావాలి. మౌలిక వసతులు విషయంలో ఒంగోలు కంటే కూడా నెల్లూరే బెటర్. ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక వర్గాల ప్రజలు ఒంగోలు సమీపంలోనే వుండడంతో నెల్లూరులోనే స్థిరనివాసాలకు ఇష్టపడవచ్చు. జిల్లా పరిధిలో రెండు పోర్టులుండడం వల్ల పారిశ్రామికంగా కూడా నెల్లూరుకే ప్రాధాన్యత వచ్చే అవకాశాలున్నాయి.

ఒంగోలు కంటే నెల్లూరుకే తాగునీటి వనరులు ఎక్కువగా వున్నందున ప్రైవేట్ కంపెనీలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు నెల్లూరు వైపే దృష్టి సారించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలన్నింటిని ఒంగోలు లోనే కేంద్రీకృతం చేయడం కష్టం కాబట్టి నెల్లూరు, ప్రకాశం, గుంటూరుజిల్లాల పరిధిలో కొత్త రాజధాని నిర్మాణం చేపట్టే అవకాశాలున్నాయి.

గుంటూరు ఇవతల ఎక్కడ రాజధానిని ప్రకటించినా నెల్లూరుజిల్లాలో మళ్లీ రియల్ ఎస్టేట్ ఒక వెలుగు వెలగడం ఖాయం. ఇప్పటికే జిల్లా రియల్ మార్కెట్‌లో కదలిక వచ్చివుండడం గమనార్హం.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియన్ ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

PDF Compressor Free Version



# రాజీనామాకు రాం... రాం...



సమైక్యాంధ్రకు కట్టుబడిన కుటుంబం వారిది. జైఆంధ్రా ఉద్యమంలోనూ వేలాదిమంది ఆందోళనకారులు తమ ఇంటిమీదకు వచ్చినప్పుడు కూడా ఆ కుటుంబం సమైక్యాంధ్రకే జైకొట్టింది. అటువంటి ఆనం కుటుంబంలో ఇప్పుడు మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి విభజన విషయంలో 'యూటర్న్' తీసుకున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సిడబ్ల్యూసిలో విభజన నిర్ణయం తీసుకున్నాక సీమాంధ్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చాలామంది తమ పదవులకు రాజీనామాలు చేసారు. సీమాంధ్ర కేంద్రమంత్రులు మాత్రం పదవులను పట్టుకుని వేలాడుతున్నారు. సీమాంధ్ర రాష్ట్ర మంత్రులు కొందరు రాజీనామాలు చేయగా చాలామంది పదవుల్లోనే వున్నారు. విభజన ప్రకటన తర్వాత తొలిసారిగా 7వ తేదీ నెల్లూరొచ్చిన ఆనం రామనారాయణరెడ్డి తాను రాజీనామా చేయడం లేదని తేల్చి చెప్పారు. తన రాజీనామాతో సమస్య పరిష్కారం కాదని చెప్పుకొచ్చారు. శాసనసభలో అన్ని పార్టీలు గట్టిగా పోరాడితే ఫలితముంటుందనేది ఆయన చెప్పే సారాంశం. అంతేకాదు, తెలంగాణకు బీజం వేసింది వైయస్సేనన్నట్లు అభాండాలు వేసారు. శాసనసభలో తీర్మానం వీగిపోయేలా చేస్తే విభజనను అడ్డుకోవచ్చని మంత్రి ఆనం అంటున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అసెంబ్లీ తీర్మానం అక్కర్లేదని ఓ పక్క దిగ్విజయ్‌సింగ్ చెబుతుంటే మరోపక్క మంత్రి ఈ మాటలు చెబుతున్నది ఎవరి చెవుల్లో పూలు పెట్టడానికో...?

# ఆంధ్రాకు రానంటే... రాను...



తమిళనాడు గవర్నర్‌గా వున్న కె.రోశయ్యకు మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యే ఛాన్స్ వచ్చింది. అయినా ఆయన దానిని తిరస్కరించినట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర విభజనకు పూనుకుని ఆ విషయం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి తెలియజేసింది. అయితే దీనికి కిరణ్ అభ్యంతరం పెట్టారు. రాష్ట్రం చీలిపోతే మావోయిస్టు సమస్య ప్రబలుతుందని, ఇంకా పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. అయినా అధిష్టానం ఆయన మాటలను చెవికెక్కించుకోలేదు. దీంతో మనస్థాపం చెందిన కిరణ్ ఓ దశలో సీఎం పదవికి రాజీనామా చేయాలనుకున్నారు. ఇది తెలిసిన అధిష్టానం ఆయన తప్పుకుంటే ఆయన స్థానంలో తిరిగి రోశయ్యను పెట్టి తెలంగాణ తంతును ముగించాలనుకుంది. ఈమేరకు ఆర్థికశాఖమంత్రి చిదంబరం చెన్నైలో రోశయ్యను కలిసారు. మీరు సీఎంగా వున్నప్పుడే తొలిసారి తెలంగాణ ప్రకటన చేసి వెనక్కితీసుకున్నాం. ఇప్పుడు తెలంగాణ ఇవ్వడం ఖాయమైంది. ఒకవేళ కిరణ్ తప్పుకుంటే సీఎంగా మీరు వెళతారా అని అడిగాడని సమాచారం. దానికి రోశయ్య... ఇక్కడ ఇప్పుడు ప్రశాంతంగా వుంది... ఈ వయసులో అక్కడికెళ్లి కొత్త సమస్యలను తెచ్చుకోలేనని సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది.

## వేమిరెడ్డి దాతృత్వం... చిన్నారుల మృదుత్వం... సంగీతప్రియుల తన్మయత్వం... వెరసి...



కార్యక్రమానికి హార్థిక మరియు ఆర్థిక సహకారాన్నందించిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి ఘనసత్కారం



తమ గానామృతంతో సింహపురి కళాభిమానులను అలరించిన చిన్నారులు



నేత్రదానానికి సిద్ధపడిన ఆటోడ్రైవర్ శశిధర్‌ను సభకు పరిచయం చేస్తున్న ప్రభు

# కళాంజలి స్వరఝురి

ఆసాంతం ఆనందం ఆహ్లాదంతో అనంత్ "కళాంజలి" నిర్వహించిన "స్వరఝరి" సంగీతప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. సేవారంగంలో అగ్రగామిగా నెల్లూరుజిల్లాలో అపరదానకర్ణుడిగా పేరొందిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కేవలం సేవ పట్లే కాకుండా కళారంగంపైనా, కళాకారులపైనా తనకున్న మక్కువను ప్రదర్శిస్తూ ఏర్పాటుచేసిన 'స్వరఝరి' కార్యక్రమంలో "పాడుతాతీయగా" విజేతలుగా నిలిచిన చిన్నారులు సింహపురి సంగీతాభిమానులను ముగ్ధులను చేసారు. పాత కొత్త పాటల కలయికతో వీనులవిందుగా సాగిన ఈ పాటల సందడి అటు పాత ఇటు కొత్తతరం వారిని తన్మయత్వంలో ఓలలాడించింది.

ప్రతి సంవత్సరంలాగే ఈ యేడాది కూడా వీరిశెట్టి హాజరత్‌బాబు సహకారంతో "అనంత్" పాడుతాతీయగాలో పాల్గొన్న చిన్నారులను నెల్లూరుకు రప్పించి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సౌజన్యంతో "స్వరఝరి" పేరుతో నిర్వహించాడు. గత పాతిక సంవత్సరాలుగా నెల్లూరు కళాప్రియులను అలరిస్తూ ఆకట్టుకుంటున్న కళాంజలి 25వ వార్షికోత్సవ వేడుకలను త్వరలోనే వి.ఆర్.సి. మైదానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వీరిశెట్టి హాజరత్‌బాబు, దోనెపర్తి వెంకయ్య, తుంగా శివప్రభాత్‌రెడ్డిలు జ్యోతిని వెలిగించి సంగీత కార్యక్రమాన్ని ప్రారంభించగా మధ్యలో ఏలాంటి ఉపన్యాసాలు విన్యాసాలూ లేకుండా ఆగష్టు3వ తేదీ శనివారం సాయంత్రం నెల్లూరు పురమందిరంలో ఈ 'స్వరఝరి' మృదుమధురంగా సాగింది.

నెల్లూరు కళాభిమానులకు మంచి కార్యక్రమాన్ని అందించినందుకుగానూ "కళాంజలి" పక్షాన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఘనంగా సత్కరించారు. అలాగే చిన్నారులందరినీ వీరిశెట్టి హాజరత్‌బాబు నేతృత్వంలో ఒక వేదికపైకి చేర్చి ప్రతియేటా వారి గాన మాధుర్యంతో నెల్లూరును పులకింపజేస్తున్న పాడుతాతీయగా డైరెక్టర్ శాస్త్రిని కూడా ఈ సందర్భంగా హాజరత్‌బాబు సత్కరించారు.

బేబి షణ్ముఖప్రియ, శ్రీలలిత, పరమేశ్వర్‌రావు, విశ్వతేజ, సుదీప్, సందీప్, సాహితీలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పాడుతాతీయగా -2013లో విజేతగా నిలిచిన అంధబాలుడు పరమేశ్వరరావుకు చట్టాలు అనుమతిస్తే తన కన్నిస్తానంటూ విడవలూరుకు చెందిన ఆటోడ్రైవర్ శశిధర్ కార్యక్రమాన్ని సమర్పించిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని అభ్యర్థించడం కార్యక్రమంలో పాల్గొన్న వేలాదిమందిని కదిలింపజేసింది. తాను 10సంవత్సరాలుగా రక్తదానం చేస్తున్నానని, ఇటీవల తన తల్లి అస్వస్థతకు గురైతే పందమందికి పైగా తమ రక్తం ఇస్తామని రావడం చూసిన తనకు మనం చేసే పుణ్యమే మనకు మంచి చేస్తుందనిపించిందని, పాడుతాతీయగా మొదటి ఎపిసోడ్ నుండి పరమేశ్వర్‌ని చూసి నా కన్ను ఇవ్వాలని నిర్ణయించుకున్నాని, చట్టం అనుమతిస్తే ఇప్పటికిప్పుడైనా తాను సిద్ధంగా వున్నానని శశిధర్ సభాముఖంగా ప్రకటించడంతో హర్షధ్వానాలతో కళాప్రియులందరూ శశిధర్‌కి అభినందనలు తెలిపారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆశీస్సులతో "అనంత్ కళాంజలి" ఆధ్వర్యంలో జరిగిన ఈ పాటల పండుగలో శ్రీమతి వై.శైలజ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

వేలాదిమంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేసిన సేవా కార్యక్రమాలను తెలియజేస్తూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమం మొత్తాన్ని విజయవంతం చేయడంలో జి.వి.శర్మ, అరుణ్, దువ్వూరు బెనర్జీ, విశ్వం తదితరుల కృషి అభినందనీయం.



# facebookలో ఈ వారం



## ఆగ్రహానికి పరాకాష్ట

రాష్ట్ర విభజనకు కారణమైన కేసీఆర్‌పై సీమాంధ్ర ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారనేదానికి ఈ ఫ్లెక్సీ ఓ ఉదాహరణ. ఓ చిన్నపిల్లోడు ఆయన ముక్కులో మూత్రం పోస్తున్నట్లుగా కట్టిన ఈ ఫ్లెక్సీని బైరెడ్డి దినేష్‌కుమార్‌రెడ్డి పోస్ట్ చేశారు.

## చిరు రాజ్యం


పదవి కోసం ప్రజారాజ్యాన్ని చిరంజీవి సోనియాగాంధీ రాజ్యంగా ఎలా మార్చాడోననేదానిని ఈ ఫోటో ద్వారా వివరిస్తూ శ్రీ పోస్ట్ చేశారు.






## ఆంధ్ర లక్ష్ములు

తమ పదవులకు రాజీనామాలు చేయని కేంద్ర మంత్రులు చిరంజీవి, కావూరం సాంబశివ రావులను మహిళల రూపంలో చిత్రీకరించి పోస్ట్ చేసారు శ్రావణ్ కుమార్, చల్లా వేణు గోపాల్‌యాదవ్‌లు.




## కొత్త భిక్షగాడు

తెలంగాణ విభజనతో ఒక సంవత్సరం తర్వాత కేసీఆర్ అడుక్కుతినాల్సొస్తుందని సూచిస్తూ వచ్చిన ఈ ఫోటోను విష్ణువర్ధన్‌రెడ్డి పోస్ట్ చేశాడు.

PDF Compressor Free Version






## కాంగ్రెస్ వల్లే నాశనం

కాంగ్రెస్‌పార్టీ ఈ దేశానికి శనిలా దాపురించింది. ఆ పార్టీ విభజించి పాలించే విధానంవల్లే దేశం నాశనమవుతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే గాంధీజీ సూచించినట్లు ఆ పార్టీని రద్దు చేసి వుంటే దేశంలో కుటుంబ పాలన అనేది వుండేదికాదు. ఓట్ల కోసం ఈరోజు తెలంగాణ చిచ్చుపెట్టి రాష్ట్రానికి తీరని నష్టం కలిగిస్తున్నారు.

ఎస్. జీవన్, ఒంగోలు.

## హైదరాబాద్ ఎవరి సొత్తు

అర్ధశతాబ్ది కాలం పాటు ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా వున్న హైదరాబాద్‌ను ఒక్క తీర్మానంతో తెలంగాణకు ఇచ్చేయడానికి కాంగ్రెస్‌పార్టీకున్న అధికారమేంటి? అసలు సోనియాగాంధీ ఎవరు? అప్పుడు భారతీయులను ఇంగ్లాండ్‌వాళ్లు విభజిస్తే ఇప్పుడు తెలుగువాళ్లను ఇటలీవాళ్లు విభజిస్తున్నారు. ఇంతకంటే మనకు సిగ్గుచేటు ఇంకొకటి వుంటుందా?

సి. ఉమామహేష్, నెల్లూరు.

## రాస్తారోకోలెందుకు

సమైక్యాంధ్రకు మద్దతుగా ఎంతోమంది ఎన్నోరకాల నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. అవి ఆహ్వానించదగ్గవే. కాని రాస్తారోకోలు, రైల్‌రోకోల వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటారు. వాటి వల్ల ఎవరికి ప్రయోజనం. గంటల తరబడి ట్రాఫిక్‌జాం అవుతుంది తప్పితే ఎవ్వరికీ ఎటువంటి లాభం వుండదు. గౌరవప్రదమైన స్థానాలలో వున్నవారు సైతం రాస్తారోకోలు, రైల్‌రోకోలలో పాల్గొనడం సముచితం కాదు. ఏదైనా నిరసన ప్రదర్శన చేస్తే అది ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా చేస్తే మంచిది.

జె. యస్. కృష్ణ, నెల్లూరు.

## రాయుడు భేష్

లక్ష్మణ్ తర్వాత టీమిండియాలో మరో తెలుగువాడుగా అరంగేట్రం చేసిన తిరుపతి రాయుడు తన సత్తా చాటుకున్నాడు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు.

కావేరి రంగ, గుంటూరు.

# 'ప్రభా'తం

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి మహాత్మాగాంధీ ఎంత మంచి చేసాడో, అదే దేశానికి కాంగ్రెస్ అనే ఒక కుటుంబ రాజకీయపార్టీనిచ్చి అంతే పొరపాటు చేసాడు. ఈ కాంగ్రెస్‌పార్టీ మూలంగా మనం స్వతంత్రభారతదేశంలో వున్నామనే భావనే లేకుండా పోతుంది. ఏ రాజకీయ సంస్థ అయినా దేశం కోసం తాము నష్టపోయే దానికైనా సిద్ధపడాలి గాని, తమ రాజకీయ సంస్థ ప్రయోజనం కోసం దేశాన్ని నష్టాల్లోకి నెట్ట కూడదు. కాని కాంగ్రెస్‌పార్టీ దేశం కంటే తమ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుంది. తమ పార్టీని అనునిత్యం అధికారంలో వుంచడం కోసం ప్రజలను ఎప్పటికప్పుడు కులాలు, మతాల వారీగా వేరు చేస్తూనే వుంది. ఇప్పుడు ప్రాంతీయ వైషమ్యాలకు సైతం ఒడిగట్టింది.

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ అనేది బూజుపట్టిన ప్రాంతీయవాదం. తెలంగాణ ప్రాంతంవాళ్లు అవసరానికి వాడుకునే ప్రచారాస్త్రం. కేసీఆర్ లాంటి అవాకారి తన రాజకీయ మనుగడ కోసం మొదలుపెట్టిందే తెలంగాణ ఉద్యమం. తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం కావాలనే చిత్తశుద్ధి ఆయనలో ఎన్నడూ లేదు. తెలంగాణ ఉద్యమం పేరుతో డబ్బులు దండుకోవడమే 13ఏళ్లుగా ఆయన ఆనవాయితీ. ఆయన ఎప్పుడూ తన ఫామ్‌హౌస్‌లో సేదతీరుతూ, అప్పుడప్పుడూ బయట కొచ్చి 'జైతెలంగాణ' అంటుంటాడు. ఆయన చేస్తున్న ఉద్యమానికి భయపడైతే ప్రత్యేకరాష్ట్రాన్ని ఇవ్వాల్సిన అవసరమే లేదు.

ఈమధ్యకాలంలో అయితే తెలంగాణ ఉద్యమతీవ్రత కూడా తగ్గింది. కేంద్రం ఇక తెలంగాణ ఇచ్చేటట్లు లేదులే అని నిర్ణయించేసుకున్నారు. దేశానికి, ప్రజలకు అవసరమైన ఏ అంశాలమీదా కాంగ్రెస్‌పార్టీ వేగంగా స్పందించదు. కాని తన రాజకీయప్రయోజనాల కోసమైతే ప్రజలు నష్టపోయే విషయమైనా సరే పట్టించుకోకుండా వేగంగా స్పందిస్తుంది. ఇప్పుడు తెలంగాణ విషయంలో కూడా అదే వేగాన్ని చూపించింది. తెలంగాణ గురించి ఆ ప్రాంతంవాళ్లే మరచిపోయివున్న తరుణంలో కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీయే పనిగట్టుకుని గుర్తుచేసింది. రాష్ట్రం నుండి ఎవరూ డిమాండ్ చేయకపోయినా దిగ్విజయ్‌సింగ్ అనే మహానుభావుడు తెలంగాణ సమస్యను తాడోపేడో తేల్చేస్తానంటూ రంగంలోకి దిగాడు. ఈ రాష్ట్ర పరిస్థితులను, ప్రజల సెంటిమెంట్లను, భవిష్యత్ పరిణామాలను పట్టించుకోకుండానే తెలంగాణ ప్రకటన చేసాడు. 2004, 2009 ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఇక్కడ మెజార్టీ ఎంపీ సీట్లొచ్చాయి. 2014ఎన్నికల్లో కూడా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు అదే విధంగా సీట్లు వచ్చే వాతావరణం వుండుంటే ఆ పార్టీ ఖచ్చితంగా విభజన జోలికి పోయివుండేది కాదు. ఇది నూటికి నూరుశాతం నిజం. రాష్ట్రంలో గట్టిగా రెండుసీట్లు కూడా వస్తాయన్న గ్యారంటీ లేకపోయే సంకేతాలు అందేసరికే కాంగ్రెస్ రాష్ట్ర విభజనకు పూనుకుంది. దీనిద్వారా సీమాంధ్రలో ఊడ్చుకుపోయినా తెలంగాణలో సగానికిపైగా సీట్లొస్తాయనే గట్టి నమ్మకం కాంగ్రెస్ అధిష్టానంలో వుంది. అందుకే శ్రీకృష్ణ కమిటీ ప్రతిపాదనలను పట్టించుకోకుండా హైదరాబాద్ సమస్య, సీమాంధ్రుల సెంటిమెంట్‌ను గౌరవించకుండా తెలంగాణకు ఆమోదముద్ర వేసింది.

స్వీయ రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌పార్టీ తీసుకున్న ఆంధ్రప్రదేశ్ విభజన నిర్ణయం దేశంలో నిశ్శబ్దంగా వున్న వేర్పాటువాదులను ఒక్కసారిగా తట్టిలేపింది. కాంగ్రెస్ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ అగ్నిగుండంగా మారి తగలబడుతోంది. ఇక అన్ని రాష్ట్రాలలోనూ వేర్పాటువాద ఉద్యమాలు మళ్లీ పురుడుపోసుకున్నాయి. పశ్చిమబెంగాల్‌లో 'గూర్ఖాలాండ్' మళ్లీ రేగింది. పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి అయ్యాక గూర్ఖా జనముక్తి మోర్చా నాయకులతో రాజీ కుదుర్చుకుని గూర్ఖాలాండ్ అభివృద్ధికి ప్రత్యేకనిధులు ప్రకటించి వారిని శాంతింపజేసారు. అయితే కాంగ్రెస్ తెలంగాణ నిర్ణయం తీసుకునేసరికి గూర్ఖాలాండ్ తిరిగి తెరమీదకు వచ్చింది. ఆ ఉద్యమం కూడా హింసాత్మకంగా మారి తీవ్రస్థాయిలో జరుగుతుండడం చూస్తూనే వున్నాం. అస్సాంలో బోడోల్యాండ్ మళ్లీ మొదటికొచ్చింది. అక్కడా ఉద్యమం హింసాత్మక రూపం సంతరించుకుంది.

మాయావతి ముఖ్యమంత్రిగా వున్నప్పుడే యూపీని నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని ప్రతిపాదించారు. ఇవికాకుండా బీహార్, జార్ఖండ్‌లలో భాగాలను కలుపుతూ 'మిథిలాంచల్', అస్సాం, నాగాలాండ్‌లలో కొన్ని భాగాలను కలుపుతూ 'దిమాషా' రాష్ట్రం, తమిళనాడు, కేరళ, కర్నాటకల సరిహద్దుల్లోని ప్రాంతాలను కలుపుతూ 'కోయనాడు', 'తమిళనాడు', కర్నాటకలో 'కూర్గ్' రాష్ట్రం, ఒడిసా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాలతో 'కోసల్' రాష్ట్రం, మణిపూర్‌ను చీల్చి 'కుకీలాండ్', మేఘాలయాను చీల్చి 'గారోలాండ్', మహారాష్ట్రలో 'విదర్భ', గుజరాత్‌లో సౌరాష్ట్రం, జమ్మూకాశ్మీర్‌ను చీల్చి లడక్ రాష్ట్రం... ఇలా అన్ని రాష్ట్రాలలో కలిసి 20దాకా కొత్త రాష్ట్రాలు విభజన కోసం ఎదురుచూస్తున్నాయి. కేంద్రం తెలంగాణకు మొగ్గుచూపడంతో ఈ వేర్పాటువాదులకు ప్రాణంపోసినట్లయ్యింది. కాంగ్రెస్‌పార్టీకి ఎంపీ సీట్లు ఇస్తామని గ్యారంటీ ఇస్తే చాలు రాష్ట్రాలను కేకుముక్క కోసి ఇచ్చినంత సులభంగా ప్రత్యేకరాష్ట్రాలను ఇచ్చేస్తారనే ధీమా తెలంగాణ ప్రకటనతో వచ్చేసింది.

## విభజన మంటలు



తన రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌పార్టీ చేసిన రాష్ట్ర విభజనతో దేశమంతటా వేర్పాటువాద మంటలు విస్తరిస్తున్నాయి. దాదాపు 20కొత్త రాష్ట్రాల కోసం ప్రత్యేక ఉద్యమాలు పురుడుపోసుకున్నాయి. దేశాన్ని విభజన పేరుతో అగ్నిగుండంగా మార్చిన పాపం కాంగ్రెస్‌దే!

## 'అంతర్'జాతీయం

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అగ్రస్థానం సాధించాడు. అనిల్‌కుంబ్లే తర్వాత ఈ రికార్డు సాధించిన ఘనత జడేజాదే. అలాగే జింబాబ్వేను 5-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేయడంతో భారత్ వన్డే ర్యాంకింగ్‌లో మొదటి స్థానాన్ని అలాగే నిలబెట్టుకుంది.
- దేశంలో నెలకొన్న జలవివాదాలకు సంబంధించి ఒకే శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.
- ఇరాన్ అధ్యక్షుడిగా హసన్‌రౌహాని(64) ఈ నెల 4వ తేదీన ప్రమాణస్వీకారం చేసారు. ఆయన నాలుగేళ్ల పాటూ ఈ పదవిలో వుంటారు.
- తాను ప్రధానిరేస్‌లో లేనని వచ్చే లోక్‌సభ ఎన్నికలలో తాను పోటీచేయడం లేదని ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ స్పష్టం చేసారు. ఇప్పటికే 14ఎన్నికలలో పోటీ చేసానని, ఇక రాజ్యసభకు వెళతానని ఆయన అన్నారు.
- వెస్టిండీస్ దిగ్గజం వివ్‌రిచర్డ్స్‌తో ఆడలేకపోయినందుకు నిరాశగా వుందని సచిన్ టెండూల్కర్ పేర్కొన్నారు.
- ఈ నెల 3న ఆఫ్ఘనిస్థాన్‌లోని భారత రాయబారి కార్యాలయం లక్ష్యంగా జరిగిన ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో 12మంది చనిపోయారు. మృతులంతా స్థానికులే!
- రైతుల ప్రయోజనాలకు రక్షణ కల్పిస్తామని కేంద్రం హామీ ఇస్తేనే ఆహారభద్రత బిల్లుకు మద్దతునిస్తామని సమాజ్‌వాది పార్టీ అధినేత ములాయంసింగ్ యాదవ్ పేర్కొన్నారు.
- లైసెన్సులు లేకుండా, పర్యావరణ అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలను చేపట్టడాన్ని దేశవ్యాప్తంగా నిరోధించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశించింది.
- గ్యాంగ్‌స్టర్ అబూసలేం అప్పగింత ఒప్పందం ఇప్పటికీ చెల్లుబాటేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో పోర్చుగల్ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను ఇక్కడి కోర్టులు పాటించాల్సిన అవసరం లేదని పేర్కొంది. దీంతో 1993నాటి ముంబై బాంబుపేలుళ్ల కేసుతో పాటు మరికొన్ని కేసులు సలేంపై విచారణకు మార్గం సుగమం అయ్యింది.
- సరిహద్దుల్లో పాకిస్థాన్ మరోసారి కవ్వింపుచర్యలకు పాల్పడింది. పాకిస్థాన్ సైనికులు పూంచ్ సెక్టార్‌లోని భారత భూభాగంలోకి జొరబడి భారత సైనికులపై దాడి చేసారు. ఈ దాడిలో ఐదుగురు భారత సైనికులు మరణించారు. ఈ దాడిపై భారత పార్లమెంట్ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్‌కు తగిన జవాబు చెప్పాలని పార్లమెంటులో ప్రతిపక్షాలు నినదించాయి.

## వార్త వ్యాఖ్య

వార్త :- 'ద్వేష' ప్రకటనలొద్దు. - దిగ్విజయ్‌సింగ్.
వ్యాఖ్య :- *విద్వేషాగ్ని రగిల్చిందే మీరు. అగ్గిపుల్ల చేతికిచ్చి తగలబెట్టొద్దంటే ఎలా?*

వార్త :- కాంగ్రెస్ వల్లే ఆంధ్రలో సెగలు. - బీజేపీ నేత వెంకయ్య.
వ్యాఖ్య :- *ఆ సెగల్లో మీకూ భాగముందిగా...!*

వార్త :- హైదరాబాద్‌ను శాశ్వత ఉమ్మడిరాజధాని చేయాల్సిందే. - చిరంజీవి.
వ్యాఖ్య :- *అవున్లే... మన ఆస్తులన్నీ అక్కడేగా వుండేది.*

వార్త :- తెలంగాణ బిల్లును అడ్డుకుంటాం. - ఉండవల్లి.
వ్యాఖ్య :- *అంతా అయిపోయాక వట్టి మాటలెందుకులే...*

వార్త :- విభజన లేదు... కాలేదు. - మాజీసీఎం నాదెండ్ల.
వ్యాఖ్య :- *ఇంట్లో కూర్చుని అలా కలలు కంటున్నారా?*

వార్త :- మేడమ్ ఎదుట మంత్రుల మౌనం. - రాష్ట్ర విభజనపై లోకసభలో సీమాంధ్రమంత్రుల తీరు.
వ్యాఖ్య :- *ఆమె ముందు ప్రధానమంత్రే మౌనంగా వుంటాడు... ఇక వీరెంత?*

వార్త :- కాంగ్రెస్‌ది రెండునాలుకల సిద్ధాంతం. - మాజీమంత్రి కోడెల.
వ్యాఖ్య :- *రెండుకళ్ల సిద్ధాంతాన్ని చంద్రబాబు కాపీరైట్ తీసుకున్నాడుగా!*

వార్త :- విభజన గురించి చిరంజీవికి ముందే తెలుసు. - దేవినేని ఉమా.
వ్యాఖ్య :- *ఆయనను కేంద్రమంత్రిని చేసినప్పుడే చెప్పివుంటారు.*

వార్త :- దిగ్విజయ్‌కి పిచ్చెక్కింది. - తెదేపా.
వ్యాఖ్య :- *కాంగ్రెస్ పిచ్చోడిచేతికి తెలంగాణ రాయిచ్చిందంటారు.*

వార్త :- ఢిల్లీ తీసుకెళ్తే మా వాణి వినిపిస్తాం. - సీఎంతో సీమాంధ్ర ఉద్యోగ నేతలు.
వ్యాఖ్య :- *ఆయన వాణికే దిక్కులేదక్కడ!*

వార్త :- కలిసి రాకపోతే ప్రజాగ్రహమే! - సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీలకు విద్యార్థి జేఏసి హెచ్చరిక.
వ్యాఖ్య :- *కలిసివస్తే సోనియా ఆగ్రహాన్ని చవిచూస్తారు.*

వార్త :- రాష్ట్రం తగలబడుతుంటే సీఎం ఫిడేల్ వాయిస్తున్నారా? - సోమిరెడ్డి ప్రశ్న.
వ్యాఖ్య :- *ఆయనకు సంగీతంలో అంత ప్రావీణ్యం వుందేంటి?*

# మండుతున్న నెల్లూరు

**❋ వివిధ పార్టీల ర్యాలీలు...ఆందోళనలు ❋ కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీల ఇళ్ళు ముట్టడి**



కేసీఆర్ దిష్టిబొమ్మకు అంత్యక్రియలు చేస్తున్న మత్స్యకార మహిళలు

నెల్లూరు జిల్లాలో సమైక్యాంధ్ర ఉద్యమం తీవ్రతరమవుతోంది. జిల్లా కేంద్రం నుంచి మండలాలు, పట్టణాలకు విస్తరించింది. ఆవేదన, ఆగ్రహంతో తమ నిరసనలను వివిధ రూపాల్లో వ్యక్తంచేస్తున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంతో ఎక్కడికక్కడ రవాణా, పాలన స్తంభించింది. ప్రయాణాలను వాయిదావేసుకునే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో జాతీయ రహదారిపై అడుగడుగునా ఆందోళనలతో రాకపోకలు ఆగిపోయాయి. ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. వివిధ రాజకీయ పార్టీలు పోటీపడి నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. దీంతో పోలీసులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. గతవారం రోజులుగా ఆందోళనకారులు కార్యక్రమాలను చేస్తున్నారు. మొత్తం మీద జిల్లాలో సమైక్యాంధ్ర ఆందోళనలు ఉద్రిక్తంగా మారాయి. దీన్ని మరింత తీవ్రతరం చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. కాంగ్రెస్ తెలుగుదేశం, వైకాపాలు పోటీపడి నిరసన కార్యక్రమాలను నిర్వహించాయి. కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసాల్ని విద్యార్థుల సంఘాలు, ఎన్జీవోల ఆధ్వర్యంలో ముట్టడించారు. వివిధ సంఘాల ధర్నాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. న్యాయవాదులు, డీఆర్‌డిఏ ఉద్యోగులు, ఎన్జీవోలు ధర్నాలో పాల్గొన్నారు. వైకాపా ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. కెసిఆర్, సోనియా వేషధారణలతో తెలుగు తల్లిని ఊరేగించారు. కెసిఆర్‌ని మధ్యవ్యసన పరుడిగా చిత్రీకరించడం అందరిని ఆకట్టుకుంది. ఈ ప్రదర్శన ఏసీసెంటర్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఫ్లెక్సీలను ధ్వంసం చేసారు. దీనిపై డిసిసి ఇన్‌చార్జ్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసారు. నగర, రూరల్ కన్వీనర్లు పోలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఆనంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దమ్ముంటే వైయస్ విగ్రహాలపై చేయి వేయాలని సవాల్ విసిరారు. జాతీయ నాయకుల విగ్రహాలను ఎక్కడా ముట్టుకోలేదని వివరణఇచ్చారు. కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఇందిరమ్మ విగ్రహానికి పాలాభిషేకం చేసారు. నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనం వివేకా, ముంగమూరు పాల్గొన్నారు. వియస్‌యూ విద్యార్థుల ఆధ్వర్యంలో సోనియా శవయాత్ర నిర్వహించి ధర్నా చేసారు. విఆర్‌సి సెంటర్‌వద్ద అన్ని సంఘాలు ఆధ్వర్యంలో ధర్నాలు చేయడంతో ట్రాఫిక్‌జాంఅయింది. ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన గాడిదయాత్ర అందరిని ఆకర్షించింది. సోనియా, దిగ్విజయ్‌సింగ్, కెసిఆర్‌ల చిత్రపటాలను గాడిదలకువేసి మేళతాళాలతో ఊరేగించారు. దర్గామిట్ట కరెంటు ఆఫీసు సెంటర్‌లో విద్యుత్ ఉద్యోగులు ధర్నాచేసి నిరసన వ్యక్తంచేసారు. ఆటోనగర్‌లో ఆటోమొబైల్ దుకాణాలు మూసివేసి నిరసన చేసారు. సమైక్యాంధ్రకు మద్దతు తెలిపారు. కావలిలో 120లారీలతో భారీగా ప్రదర్శన నిర్వహించారు. వంటావార్పు కార్యక్రమాలను నిర్వహించారు. గూడూరు ఆదిశంకర్ కాలేజీ వద్ద విద్యార్థులు జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు. గూడూరులో ర్యాలీలు ధర్నాలు నిర్వహించారు.




నెల్లూరుజిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదుల గుమస్తా సంఘం ఆధ్వర్యంలో సమైక్యాంధ్ర వర్ధిల్లాలి అంటూ నిర్వహించిన ర్యాలి

ఉదయగిరి, ఆత్మకూరు, వరికుంటపాడు తదితర ప్రాంతాల్లో వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు మానవ హారాలుగా ఏర్పడి నాయకులకు కనువిప్పు కలగాలని కోరారు.

నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరిల్లో భారీగా విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి రాస్తారోకోలు చేసారు. కోవూరు, బుచ్చి, దగదర్తి, కలిగిరి, వింజమూరు, జలదంకి గ్రామాల్లో స్వచ్ఛందంగా జనం రోడ్లపైకి వచ్చి నిరసనలు ప్రకటించారు. నగరపాలకసంస్థ, పురపాలక సంఘాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. మంగళవారం జిల్లాలో ఆర్టీసీ బస్సు సర్వీసులు ఆగిపోయాయి. దాదాపు 150బస్సులను నిలిపివేసారు. మంగళవారం నెల్లూరులో సమైక్యాంధ్ర పరిరక్షణ సమితివేదిక ఏర్పడింది. అన్ని సంఘాలను ఈ వేదిక కిందకు తెచ్చి నిరసన కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని తీర్మానించారు. బుధవారం నిరసన కార్యక్రమాలు ఉధృతం చేసారు. బిజేపి జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు నివాసాన్ని ముట్టడించారు. అన్ని పార్టీల నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టాయి. జిల్లా కోర్టు వద్ద లాయర్ గుమస్తాల సంఘం ఆధ్వర్యంలో సమైక్యాంధ్ర వర్ధిల్లాలి అంటూ ర్యాలీని నిర్వహించారు.



వెంకయ్యనాయుడు ఇంటి ముందు ఆందోళన చేస్తున్న సమైక్యవాదులు

ఎంసీఐ నిబంధనల మేరకు...

## వైద్య కళాశాల నిర్మాణం



కళాశాల ప్రణాళికను పవర్‌ప్రజెంటేషన్ ద్వారా పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు నగరంలోని దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మాణంలో వున్న వివిధ వైద్య విభాగాలకు సంబంధించిన నిర్మాణాలు ఎంసీఐ నిబంధనలు మేరకు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఇంజినీర్లకు సూచించారు. నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలలకు సంబంధించిన ప్రణాళికను పవర్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ వైద్య కళాశాల ప్లానింగ్ ప్రకారం కాకుండా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రణాళికను అనుసరించి కళాశాలకు సాంకేతిక, వైద్య మౌలిక సదుపాయాలకు అనుగుణంగా అవసరమైన నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో మైక్రోబయోలజీ, బయోకెమిస్ట్రీ, అనాటమీ, ఫిజియాలజీ తదితర విభాగాల ప్రొఫెసర్లు సూచించిన విధంగా నిర్మాణాలు చేపట్టాలని ఇంజనీర్లకు ఆదేశించారు. ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు విద్యార్థులకు అనువుగా ప్రత్యేక గదులను ఏర్పాటుచేయాలన్నారు. కళాశాలకు సర్కారు 100కంప్యూటర్లను వివిధ విభాగాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుందని దానికి అనుగుణంగా సాంకేతిక నిర్మాణం చేపట్టాల న్నారు. ఈ సమీక్షా కార్యక్రమంలో జిల్లా వైద్య కోఆర్డినేటర్ డాక్టర్ నిర్మలమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారావు, రీజనల్ మెడికల్ అధికారి ఉషాసుందరి, వైద్యులు హిమదేవి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## గుంతలోపడి బాలుడి మృతి

నెల్లూరు నగరపాలకసంస్థ అధికారుల నిర్లక్ష్యం ఓ బాలుడి మృతికి దారితీసింది. నెల్లూరు నగరం కపాడిపాలెంలో కమ్యూనిటీహాలు శంకుస్థాపన కోసం తవ్విన గోతిలోపడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నెల్లూరు కపాడిపాలెంకు చెందిన అరవ ఏసు, శాంతమ్మ కుమారుడు బన్ని(9) ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఆ ప్రదేశంలో నగరపాలక సంస్థవారు నాలుగు రోజుల క్రిందట కమ్యూనిటీహాలు నిర్మాణం కోసం 15అడుగులు గుంతను తవ్వి వదిలేశారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి గుంత నీటితో నిండిపోయింది. నిర్మాణంచేపట్టే కాంట్రాక్టర్ ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేయలేదు. మంగళవారం ఉదయం అరవ బన్నీ ఆడుకుంటూ గుంతలో పడిపోయి చనిపోయాడు. ఎంతసేపటికి బన్ని కనిపించకపోవడంతో తల్లిదండ్రులు బంధువులు వెతకడం ప్రారంభించారు. చివరికి బన్ని చెల్లెలు చెప్పిన వివరాలు మేరకు గుంతలో పడివున్న బాలుడ్ని బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో బన్నీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## ఎన్జీఓల నిరసన ప్రదర్శన


సమైక్యాంధ్రను కోరుతూ ఈనెల 6న నెల్లూరు దర్గామిట్టలోని ఎన్జీఓ హోం నుంచి ఉద్యోగులు భారీప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.రవీంద్రబాబు మాట్లాడుతూ సీమాంధ్రమంత్రులు పదవీకాంక్షతో, తమ ప్రాంత ప్రయోజనాలను విస్మరించి సోనియాగాంధీ ముందు మోకరిల్లుతున్నారని దుయ్యబట్టారు. సమైక్యాంధ్ర కోసం రాజీనామాలు చేయని ప్రజాప్రతినిధులను వేర్పాటువాదులుగా పరిగణిస్తామని పేర్కొన్నారు. తదుపరి న్యూ మిలటరీకాలనీలోని కేంద్రమంత్రి పనబాకలక్ష్మి ఇంటివద్దకు మేళతాళాలతో చేరుకుని ముట్టడించడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎన్జీవో వెంకటయ్య అరగుండుతో నిరసన తెలిపారు. నిరసన ప్రదర్శనలో ఉద్యోగులు సుధాకర్, శేఖరరావు, కుసుమాకర్, మాధవయ్య, రమణారెడ్డి, విద్యార్థి జేఏసి నాయకులు అంజయ్య, జేవీప్రసాద్ పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రికి

## 10లక్షల విరాళం

నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో శరవేగంగా నిర్మించబడుతున్న సర్జికల్ మరియు ఔట్ పేషంట్ బ్లాక్‌కు భగవాన్ మహావీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ వారు చివరి విడతగా 7వ తేదీ 10లక్షల రూపాయలు విరాళం చెక్కును జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌కు అందజేశారు. గతంలోనే వారు ఇందుకోసం కోటి 10లక్షల విరాళం ఇచ్చివున్నారు. దీంతో కోటి 20లక్షలు ఇచ్చినట్లయ్యింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌సభ్యులు మోహన్‌లాల్‌జైన్, జె.పి.జైన్, శాంతిలాల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## కంటితుడుపు కమిటీ!



రాష్ట్ర విభజన నిర్ణయం ప్రకటించాక సీమాంధ్రుల గోడు వినేందుకు సోనియాగాంధీ ఒక కమిటీని వేసింది. రక్షణమంత్రి ఏ.కె.ఆంటోని నేతృత్వంలో పనిచేసే ఈ కమిటీలో దిగ్విజయ్ సింగ్, వీరప్పమొయిలీ, అహ్మద్‌పటేల్‌లు సభ్యులు. ఈ కమిటీ రాష్ట్రానికి వచ్చి ఏం వెలగబెడుతుంది. ప్రజలకు ఏం ఒరగబెడుతుందన్నదే ప్రశ్న? ఈ కమిటీ వచ్చినా సోనియాగాంధీ ఇచ్చిన స్క్రీన్‌ప్లే ప్రకారం నడుచుకోవాల్సిందే! ఈ కమిటీ వచ్చి ఆందోళనలు జరుగుతున్నాయి కదా అని చెప్పి రాష్ట్ర విభజనను ఆపేదేమీ వుండదు.

రాష్ట్ర విభజనపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కితగ్గేది లేదని కాంగ్రెస్ అధిష్టానం కుండబద్దలు కొట్టినట్లుగా చెబుతుంది. ఇక ఈ కమిటీ ఏం చేస్తుంది. సీమాంధ్రులతో సమావేశమై మీకేం కావాలి, కొత్త రాజధాని ఎక్కడకావాలి, ఎన్ని నిధులు కావాలి, ఎన్ని నీళ్లు కావాలి... ఇదే వీరు మాట్లాడబోయేది. ఈ మాత్రందానికి కమిటీ ఎందుకు? ఇదో దండగమారి కమిటీయే! సీమాంధ్రులను కాంగ్రెస్ అధిష్టానం ఇంటి నుండి గెంటేసింది. అనాధల్లా వదిలేసింది. ఏ కమిటీ వచ్చినా వీళ్ల కన్నీళ్లు తుడవలేవు.

☞ 12 అర్ధరాత్రి నుంచి

## రెవెన్యూ పాలన బంద్

సమైక్యాంధ్ర మద్దతుగా ఈనెల 12వతేది అర్ధరాత్రి నుంచి రెవెన్యూ పాలన స్తంభింపజేసి నిరవధిక సమ్మెలోకి రెవెన్యూ ఉద్యోగులు వెళ్ళేలా తీర్మానం చేయడం జరిగిందని రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు షఫీమాలిక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని అసోసియేషన్ కార్యాలయంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, విఆర్‌ఏ, వీఆర్వోల అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించి, సమైక్యాంధ్ర సాధించుకునేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తీర్మానం చేసారు. 12వతేది నుంచి జరిగే నిరవధికసమ్మెకు రెవెన్యూ ఉద్యోగులు సహకరించాలని షఫీమాలిక్ కోరారు.

## మధ్యాహ్న భోజనానికి 24.57కోట్లు విడుదల

నెల్లూరు జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంబంధించి 2013 జూలై నుంచి 2014 వరకు 24.57కోట్లు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.రామలింగం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఖజానా కార్యాలయం నుంచి ఆదేశాలు అందేలోగా ఎంఈవోలు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు, సహాయకులకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లింపుల కోసం సిద్ధంగా ఉంచుకోవాలని డిఇవో సూచించారు. జూన్ 2013 వరకు విడుదల చేసిన నిధులు పూర్తిగా చెల్లింపులు చేయాలనికోరారు. మధ్యాహ్న భోజన పథకం రేట్ల పెంపుదలకు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి రాగానే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వంటగదుల నిర్మాణం కోసం అడిగిన సమాచారాన్ని వెంటనే ఎంఈవోలు ఉప విద్యాశాఖాధికారులకు అందజేయాలని సూచించారు.

PDF Compressor Free Version





ఈ నెల 7వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు అధికారులతో జరిగిన సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

# నెల్లూరు కబుర్లు

## మన డిజిపి మనకే!



ఆంధ్రప్రదేశ్ రెండుగా చీలింది. సీమాంధ్ర కలిసి ఆంధ్రప్రదేశ్‌గానే వుండబోతుంది. తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడబోతుంది. ఇక తెలంగాణకు గవర్నర్, సీఎం, సీఎస్, డిజిపి... ఇలా అందరూ కొత్తవాళ్లే! కాగా ఇప్పుడున్న పోలీస్ డిజిపి వి.దినేష్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా కొనసాగనున్నారు. ఆయన నెల్లూరుజిల్లాకు చెందిన ఐపిఎస్ అధికారి కావడం వల్ల ఆంధ్రప్రదేశ్ డిజిపిగా ఆయనే కొనసాగవచ్చు. అదే తెలంగాణ అధికారి ఎవరైనా డిజిపిగా వుండుంటే ఆంధ్రప్రదేశ్ డిజిపిగా కొత్తవారికి అవకాశముండేది.

## పెళ్లిళ్ల సీజన్

శ్రావణమాసం వచ్చేసింది. శుభ కార్యాలకు ఇదే మంచి ముహూర్తం. ఎక్కడచూసినా భాజాభజంత్రీలు మోగుతున్నాయి. వివాహ వేడుకలతో కల్యాణ మండపాలు కళకళలాడుతుండగా, అతిథులతో హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. అయితే ఈ సమయంలో సీమాంధ్ర ఉద్యమం ఓ పక్క జరుగుతుండడంతో కొంత ఇబ్బంది తప్పడం లేదు. అయినా ప్రజలు పెళ్ళిళ్లు, గృహ ప్రవేశాల కంటే సమైక్యాంధ్ర ఉద్యమానికే అధికప్రాధాన్యతనిస్తున్నారు.

## విద్యార్థి జేఏసీ రాష్ట్ర కో- కన్వీనర్‌గా ప్రసాద్



విద్యార్థి సమస్యలను పరిష్కరించడంలో కృషిచేసిన ఎన్ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు, వైకాపా విద్యార్థి విభాగ పార్లమెంటు ఇన్‌ఛార్జి జివిప్రసాద్‌ను సమైక్యాంధ్ర విద్యార్థి రాష్ట్ర కో-కన్వీనర్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు సమైక్యాంధ్ర విద్యార్థి రాష్ట్ర కన్వీనర్ డివి కృష్ణయాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు తదితరులు అభినందనలు తెలియజేశారు.

## జడ్పీ అతిథి గృహం రూపుమారుతోంది

### --- మరమ్మత్తు ఖర్చులకు నిధుల మంజూరు ---



నెల్లూరు ఆచారివీధిలో 1964లో అప్పటి జిల్లా పరిషత్ ఛైర్మన్ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి చొరవతో ఆనాటి పంచాయతీ రాజ్ శాఖామంత్రి చెన్నారెడ్డి కాలంలో నిర్మించిన జడ్పీ అతిథి గృహానికి మహర్దశ పట్టి రూపురేఖలు మారనున్నాయి. జడ్పీ కార్యాలయానికి వెనుక వైపున అనిత సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న ఈ భవనాన్ని సర్వాంగసుందరంగా నిర్మించడంతో మంత్రులు, వివిఐపిలు ఈ అతిథిగృహాన్ని వినియోగించుకునేవారు. కాలక్రమేణా నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలతో ఏసీలు కిటికీలు, అద్దాలు, కుర్చీలు తదితర వస్తువులన్నీ మరమ్మత్తులకు గురయ్యాయి. దీంతో జడ్పీ అతిథి గృహానికి అతిథుల రావడం మానేశారు. ఫలితంగా ఈ భవనం మరమ్మత్తులకు నోచుకోక పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ క్రమంలో జడ్పీ సిఇఓ వీరభద్రయ్య పదవీవిరమణ చేసేముందు జడ్పీ అతిథి భవనం మరమ్మత్తులు చేసేందుకు నిధులు విడుదల చేయించారు.

దాదాపు 10లక్షల రూపాయలతో మరమ్మత్తులు పనులు చేపట్టారు. త్వరలో ఈ భవనం రూపురేఖలు మారి సుందరంగా రూపుదిద్దుకోనుంది.

## పోలీసు కార్యాలయ సిబ్బంది నిరసన

నెల్లూరు జిల్లాలో సమైక్యాంధ్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. ఈ పరిస్థితుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా జిల్లాలోని పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టింది. అదే సమయంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని మినిస్టీరియల్ సిబ్బంది సమైక్యాంధ్ర ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఏపిఎన్జీఓ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మినిస్టీరియల్ సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తంచేసారు. భోజన విరామ సమయంలో ఉద్యమ నినాదాలు చేసారు. రాష్ట్ర విభజన ప్రతిపాదనను యూపీఏ ప్రభుత్వం వెంటనే ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేసారు.

## ట్రావెల్స్‌లో ఆందోళన



రాష్ట్ర విభజన నిర్ణయంతో ప్రైవేట్ ట్రావెల్ ఏజన్సీల వాళ్లు ఆందోళన చెందు తున్నారు. దీనికి కారణం తమ కలెక్షన్‌లు పడిపోతాయని. పక్కనే వున్న గూడూరు కో, కావలికో పోయినంత సులభంగా ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రయాణీకులు నెల్లూరు నుండి హైదరాబాద్‌కు వెళుతుంటారు. పండుగలు, సెలవుదినాలలో అయితే హైదరాబాద్ బస్సులకు టిక్కెట్లు దొరకాలన్నా గగనమే. నెల్లూరు నుండి హైదరాబాద్‌కు రాత్రి సమయంలో ఐదు ట్రైన్‌లు అందుబాటులో వున్నా ప్రయాణీకుల సంఖ్యకు తగ్గట్లుగా రిజర్వేషన్లు దొరకవు. దీంతో చాలామంది ప్రయాణీకులు ప్రైవేట్‌బస్సులపైనే ఆధారపడుతున్నారు. నెల్లూరులో కావేరి, కామాక్షి, కాళేశ్వరి, కేశినేని, శ్రీకృష్ణ, నవీన్, ఎస్ఆర్ఎం, రాజేష్, ధనుంజయ, ఎస్‌వీఆర్ వంటి ప్రైవేట్ ట్రావెల్స్ అన్నీ కలిపి 10కిపైగా వోల్వోబస్సులు, 20కిపైగా హైటెక్‌బస్సులు నడుపుతున్నాయి. ప్రతిరోజూ ఇవి రద్దీగా నడుస్తుంటాయి.

ఇక్కడివారికి హైదరాబాద్‌తో అనుబంధముండి కాబట్టి బస్సులు నిండుగా వెళుతుంటాయి. ఇప్పుడు తెలంగాణ విభజనతో హైదరాబాద్ మనకు దూరమవుతుందనే భావన ప్రజల్లో ఏర్పడుతుంది. ఈ దృష్ట్యా భవిష్యత్‌లో హైదరాబాద్‌కెళ్లే ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయే అవకాశముంది.

## టంగుటూరికి ఆర్యవైశ్య యువజన పదవి

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగ్ అధ్యక్షులుగా టంగుటూరి రామకృష్ణ గతనెల 27న నియమితులయ్యారు. మహాసభ అధ్యక్షులు కాళ్ళకూరి శ్రీరామనాగేశ్వరరావు 2013-15 కాలానికి రామకృష్ణను ఈ పదవిలో నియమించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర కార్యదర్శిగా, వాసవీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కన్వీనర్‌గా, దరిశి సేవా సంస్థ కన్వీనర్‌గా సేవలందించిన రామకృష్ణ ఈ రెండు సంవత్సరాల కాలంలో యువజన విభాగ్ శాఖలను పటిష్టపరచి వైశ్య జాతికీ, రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభకు మరింత పేరుప్రతిష్టలు పెంపొందేలా కృషిచేస్తానంటున్నారు. తన ప్రతి ముందడుగుకీ తమిళనాడు రాష్ట్ర గవర్నర్ కొణిజేటి రోశయ్య ఆశీస్సులే కారణమన్నారు.

## "బెస్ట్ ఛైర్మన్" మనోహర్‌రెడ్డి



నెల్లూరులోని మైథిలి ఇంగ్లీషుమీడియం హైస్కూలు అధినేత లయన్ బి.మనోహర్‌రెడ్డి ఇటీవల గుంటూరులో జరిగిన లయన్స్ సమావేశంలో బెస్ట్ ఛైర్మన్ అవార్డును ప్రదానం చేసినట్టు లయన్స్ మాజీ గవర్నర్ నాగేశ్వరరావు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కౌమారదశ పిల్లల సమస్యలపై అవగాహన కలిగేలా సదస్సులను నిర్వహించి చైతన్యం తెచ్చినందుకు ఆయనకు ఈ అవార్డు అందించారని తెలిపారు. లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడిగా కూడా ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు.

## అమరజీవి...కేసీఆర్‌ను క్షమించు

తెలుగు ప్రజల సమైక్యంకోసం అమరణ నిరాహారదీక్షచేసి అసువులు బాసిన అమరజీవి పొట్టిశ్రీరాములు క్షమించి వేర్పాటువాది కేసీఆర్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని విక్రమ సింహపురి యూనివర్శిటీ అధ్యాపకులు వేడుకున్నారు. రాష్ట్ర విభజన ప్రకటన, కేసీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం అధ్యాపకులు చేపట్టిన భారీ నిరసన ప్రదర్శన గాంధీబొమ్మ సెంటర్ నుంచి కనకమహాల్, సుబేదారుపేట మీదుగా ఆత్మకూరుబస్టాండు వరకు సాగి, అక్కడున్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేసారు. ఈ సందర్భంగా వివిఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ విభజన ప్రకటనను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. సీమాంధ్ర ఉద్యోగులను ఇబ్బందిపెడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. విభజన ప్రకటనను వెనక్కు తీసుకునే వరకు అధ్యాపక జేఏసీ తరపున ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా॥సునందమ్మ, కుసుమ, సుబ్బారెడ్డి, చెంచు రెడ్డి, వేణుగోపాలరెడ్డి, సునీత, విజయకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విభజనకు నిరసనగా గాడిదలతో నిరసన



రాష్ట్ర విభజనను నిరసిస్తూ తెలుగు యువత నాయకుడు శింగంశెట్టి రవిచంద్ర ఆధ్వర్యంలో 6వ తేదీ నెల్లూరులో వినూత్న నిరసన ప్రదర్శన జరిగింది. మూడు గాడిదల మీద సోనియాగాంధీ, దిగ్విజయ్ సింగ్, కేసీఆర్‌ల ఫోటోలు పెట్టి గాంధీబొమ్మ సెంటర్‌లో ఊరేగించారు. ఈ ముగ్గురు నాయకులు గాడిదలకన్నా హీనమైనవాళ్లని, కంచరగాడిదలని తీవ్ర పదజాలంతో నిరసనకారులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో శింగంశెట్టి మురళీమోహన్‌రావు, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## క్యాంపస్ ఎంపికలో నారాయణ విద్యార్థులు

క్యాంపస్ ఎంపిక ద్వారా ఓల్టెక్ అనే బహుళజాతి సంస్థకు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 12 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థినీ, విద్యార్థులను మంగళవారం కళాశాల ప్రాంగణంలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలో బిటెక్ పూర్తిచేసిన ఈసిఈ, ఈఈఈ విభాగాలకు చెందిన 12మందికి ఏడాదికి ఒక్కొక్కరికి 2లక్షలు వేతన ఒప్పందం కింద ఉద్యోగ అవకాశాలు లభించడం అభినందనీయమన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భార్గవ్‌రామ్ మాట్లాడుతూ త్వరలో ఇంటెల్, ఐడియా సెల్యూలార్ కంపెనీ ప్రతినిధులు తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# ఎన్‌జిఓల వెంట నడుస్తాం!

సింహపురి సమాచారం



సమైక్యాంధ్ర కోసం ఏపి ఎన్‌జిఓల సంఘం ఈ నెల 12నుండి నిర్వహించే సకలజనుల సమ్మెకు నెల్లూరు వర్తక, వాణిజ్య వ్యాపార సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ నెల 6వ తేదీన నెల్లూరు రేబాల వారి సందులోని సింహపురి వాణిజ్య మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ సమైక్యాంధ్ర కోసం జరిగే ప్రతి ప్రయత్నానికి కూడా తమ మద్దతు వుంటుందన్నారు. రాష్ట్ర విభజన జరిగితే విద్యార్థులకు, ఉద్యోగులకు, వ్యాపారులకు ఎన్ని సమస్యలు తలెత్తుతాయో పరిశీలించకుండా కేంద్రం ఏకపక్షంగా విభజన నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర విభజన అడ్డుకోవడంలో విఫలమైన సీమాంధ్ర ప్రజాప్రతినిధులు ఇప్పుడు తలోమాట మాట్లాడుతూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు.

ఈ సమావేశంలో వ్యాపారవర్గాల నాయకులు దాసా లక్ష్మీనారాయణ, మంచికంటి శ్రీనివాసులు, శ్రీరాం రమేష్, కనమర్లపూడి తిరుమలరావు, వెసల నరసింహస్వామి, చలువాది నాగేశ్వరరావు, కోట గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు మూలాపేటలోని శ్రీ ధర్మరాజస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 6వ తేదీన జరిగిన కీచకవధ ఘట్టంలో పాల్గొన్న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి

# కాంగ్రెస్ నాయకులు రెచ్చగొడుతున్నారు

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి**

నెల్లూరు మినీబైపాస్‌లోని బిజెపీ జిల్లా కార్యాలయంలో ఈనెల 4న విలేకరుల సమావేశం జరిగింది. బిజెపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పదవులను పదిలంగా చూసుకునే కాంగ్రెస్ నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారని, తెలంగాణలో ఓ రకంగా సీమాంధ్రలో మరోరకంగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారని మండిపడ్డారు. సీట్లు, ఓట్లకోసం బిజెపీ పనిచేయదని స్పష్టంచేస్తూ కాంగ్రెస్, టీడీపీలు కుమ్మక్కై సీమాంధ్రలో అభద్రతా భావాన్ని సృష్టించాయన్నారు. సీమాంధ్రకు జల, విద్యుత్ ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించకుండా విభజన చేపట్టడం మంచిదికాదన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ మాటతీరు బాగాలేదని, భవిష్యత్‌లో తెలంగాణలో సీమాంధ్రప్రజలు పడే అగచాట్లకు మచ్చుతునకగా వున్నాయన్నారు. తెలంగాణతో పోల్చుకుంటే సీమాంధ్రే వెనకబడి వుందన్నారు. తెలంగాణ ప్రాంతంలో 17వేల లక్షల విద్యుత్ కనెక్షన్లు వుంటే సీమాంధ్రలో కేవలం 12వేల లక్షల విద్యుత్ కనెక్షన్లు వున్నాయని తెలిపారు. రాయలసీమ అభివృద్ధి కోసం 15ఏళ్ళుగా తమ పార్టీ పోరాడుతోందన్నారు. సమావేశంలో బిజెపీ రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని ముక్కచెక్కలు కానివ్వం!

**హైదరాబాద్ కెసిఆర్ జాగీర్ కాదు** - ఆనం, ముంగమూరు



అహింసాపద్ధతిలో ఉద్యమాన్ని నడిపి రాష్ట్రాన్ని ముక్కలు కాకుండా కాపాడుకుందామని, సీమాంధ్ర ఉద్యోగులను వెళ్ళమని చెప్పేందుకు కెసిఆర్ ఎవరని, హైదరాబాద్ కెసిఆర్ జాగీర్‌కాదని నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా సోమవారం సాయంత్రం నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు ఏసీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముంగమూరు మాట్లాడుతూ రాష్ట్ర సమైక్యత కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు పనిచేశారన్నారు. వారి విగ్రహాలను ధ్వంసం చేయవద్దని ఉద్యమకారులను కోరారు. రాష్ట్ర విభజన జరిగితే హైదరాబాద్‌లోని సీమాంధ్ర ఉద్యోగులకు, ప్రజలకు రక్షణ కరువవుతోందన్నారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ సమైక్య ఉద్యమజ్వాలలు కెసిఆర్ కుటుంబాన్ని దహించి వేస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసి ఇన్‌చార్జి అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, ఏపీ ఎన్జీఓ నాయకులు రవీంద్రబాబు, కృష్ణ యాదవ్, ఆదిత్యసాయి, ముజీర్, కాంగ్రెస్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర విభజన వద్దు

**- ముస్లిం జాగరణ సమితి**



రాష్ట్ర విభజన నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ నెల్లూరులోని ముస్లిం జాగరణ సమితి ఈనెల 6న జిల్లా కలెక్టర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు మహమ్మద్ రవూఫ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రజల మనోభావాల్ని దెబ్బతీస్తూ యు.పి.ఏ ప్రభుత్వం చర్యలు తీసుకొనేలా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర విభజన ప్రక్రియ మొదలుపెట్టకముందే కేసిఆర్ సీమాంధ్ర ప్రజల్ని ఉద్దేశించి "భాగో" అని వ్యాఖ్యానించడం చూస్తుంటే విభజన జరిగితే ఆంధ్రప్రాంత ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడడం చూస్తుంటే వారు ఆంధ్రప్రాంత ప్రజల్ని ఏవిధంగా చూస్తున్నారో అర్థమవుతుందని కాబట్టి విభజన నిర్ణయాన్ని మార్చుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమైక్యంగానే వుంచాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ఖాలిద్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# సీమాంధ్ర మంత్రులే ద్రోహులు

**- దేవినేని ఉమ**



రాష్ట్రవిభజనలో సీమాంధ్ర కేంద్ర మంత్రులే ద్రోహులుగా మారారని, కేంద్ర ప్రభుత్వం వీరికి పదవుల తాయిలాలిచ్చి రాష్ట్రాన్ని నిలువునా చీల్చిందని తెలుగుదేశంపార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఈ నెల 5న నెల్లూరులోని ఎన్టీఆర్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కావూరి సాంబశివరావు, చిరంజీవి, పురందేశ్వరిలు రాష్ట్ర విభజన గురించి ముందే తెలిసినా అడ్డుకోకుండా విభజనకు సహకరించారన్నారు. చిరంజీవి పోలవరం గురించి మాట్లాడుతున్నారని, దాని ద్వారా ఏయే జిల్లాలకు నీళ్లివ్వగలరో ఆయన చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎంపీ లగడపాటి రాజగోపాల్ చెప్పిన బ్రహ్మాస్త్రం ఏమైందని, ఆయన చెప్పిన బ్యాట్స్‌మెన్ ఎందుకు రంగంలోకి దిగలేదని ఎద్దేవా చేసారు. ముఖ్యమంత్రి అసలు మీడియా ముందుకు ఎందుకు రావడంలేదని, అసమర్థ ముఖ్యమంత్రి వల్లే రాష్ట్ర విభజన జరిగిందన్నారు. కాంగ్రెస్ తన స్వార్థానికి చేసిన విభజన వల్ల దేశంలో 21రాష్ట్రాల ఉద్యమాలు పుట్టుకొచ్చాయన్నారు. సరిహద్దుల్లో చైనా చొరబాట్లను అడ్డుకోలేకపోతున్న కేంద్రప్రభుత్వం సీమాంధ్రలో కడుపుమండి ఉద్యమిస్తున్న వారిని అడ్డుకోవడానికి బిఎస్ఎఫ్ దళాలను పంపడం శోచనీయమన్నారు. రాష్ట్ర విభజన గురించి చిరంజీవికి ముందే తెలుసుకాబట్టి తన కొడుకు నటించిన 'ఎవడు' సినిమా విడుదలను వాయిదా వేయించాడన్నారు. పనికిమాలిన డ్రామాలను ఆపి కేంద్ర మంత్రులు, ఎంపీలు సోనియా, మన్మోహన్‌సింగ్‌లను నిలదీయాలని సూచించారు.

## ఉద్యమం ఉద్యమమే...
# పనులు పనులే...



ఈ నెల 6వ తేదీన నెల్లూరులోని వేణుగోపాలస్వామినగర్‌లో 20 లక్షలతో నిర్మించే సి.సి.రోడ్లకు, 15 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు జంట ఎమ్మెల్యేలు ఆనం వివేకానంద రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ పక్క సమైక్యాంధ్ర ఉద్యమం నడుపుతున్నామని, అయినా ఇంకోపక్క అభివృద్ధిపనులను ఆగనివ్వబోమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులకు కొరతలేదని, ఈ నెలాఖరులోగా నగరంలోని 30వేల మందికి రేషన్ కార్డులు ఇవ్వనున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనర్ డి.జాన్‌శ్యాంసన్, కాంగ్రెస్‌నాయకులు యల్రంరెడ్డి మాధవరెడ్డి, ఎం.నారాయణరెడ్డి, ఎం.మధు, సిద్ధు రమణారెడ్డి, యనమల నాగేశ్వరరావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితుడ్ని ఆదుకున్న కలెక్టర్

నెల్లూరుజిల్లా వింజమూరు బీసీకాలనీకి చెందిన ఓంకారం బాబురాజు కిడ్నీవ్యాధితో బాధపడుతూ సోమవారం జిల్లాకలెక్టర్ శ్రీకాంత్‌ను కలిసి తనను ఆదుకోవాలని వేడుకున్నారు. కిడ్నీవ్యాధితో బాధపడుతూ నెల్లూరు, చెన్నైలలోని అన్ని ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకున్నా జబ్బు నయంకాలేదని ఆవేదన వ్యక్తంచేసాడు. ప్రతినెలా మందులకు అయిదువేల రూపాయలు ఖర్చవుతున్నాయని, పేదరికంలో ఉన్న తనకు ఈ మొత్తం భారంగా మారిందని భార్య, ఇద్దరుపిల్లలను పోషించలేక జబ్బు నయంకాక నానాబాధలు పడుతున్నానని కనీసం మందుల ఖర్చులకైనా ఆర్థికసాయం చేయాలని బాబురాజు కలెక్టర్ ఎదుట కన్నీరుమున్నీరయ్యాడు. దీనికి స్పందించిన కలెక్టర్ బాబురాజుకు ప్రతినెలా మందులు ఉచితంగా ఇవ్వాలని ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా॥అనిల్‌ను ఆదేశించారు.

# రాష్ట్రం కాష్టమైంది

(మొదటిపేజీ తరువాయి)

ఇంకా పలు రాష్ట్రాలలో వేర్పాటు ఉద్యమాలు మొదలై ఆ రాష్ట్రాలు కూడా అహింసాజ్వాలలతో రగిలిపోతున్నాయి. దేశాన్ని ఇలా తగలబడేలా చేసిన సోనియా గాంధీకి ఒక రాష్ట్రాన్ని, ఒకటిగా కలిసివున్న జాతిని చీల్చడానికి వున్న అధికారమేమిటి? ఆమె కాంగ్రెస్‌పార్టీకి అధ్యక్షురాలు మాత్రమే. పార్లమెంటు సభ్యురాలు, యూపీఏకు ఛైర్‌పర్సన్. ఈ మూడింటిలో ఏ పదవికి కూడా రాష్ట్రాన్ని విభజించేంత అధికారంలేదు. ఇక దిగ్విజయ్‌సింగ్ అయితే కేంద్రమంత్రి కూడా కాదు. ఎలాంటి అధికారం లేకుండానే వీళ్లిద్దరూ పచ్చగా, ప్రశాంతంగా వున్న ఆంధ్రప్రదేశ్‌ను తగలబెట్టారు. ఇక్కడి ప్రజల మీద, తెలుగు జాతి ఒక్కటిగా వుండాలన్న ప్రజల మనోభావాల మీద వారికి కొంతన్నా ఇంగిత జ్ఞానం వుండుంటే ఏకపక్షంగా తెలంగాణ ప్రకటించే వాళ్లుకాదు.

ఎన్డీఏ హయాంలో ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్, జార్ఖండ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసారు. వాటి ఏర్పాటులో ఎలాంటి అశాంతి చోటుచేసుకోలేదు. కారణం కొత్తగా ఏర్పడాలనుకున్న రాష్ట్రాలే కొత్త రాజధానిని ఏర్పాటు చేసుకున్నాయి. కాని ఆంధ్రప్రదేశ్ అలా కాదు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ అనే చిన్న రాష్ట్రానికి ఐదున్నర దశాబ్దాల పాటు అందరి శ్రమతో అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్‌ను శాశ్వత రాజధానిగా ఇచ్చేసి పెద్దరాష్ట్రంగా వున్న సీమాంధ్రులకు కొత్తగా రాజధాని ఏర్పాటు చేసుకోమన్నారు. హైదరాబాద్ నుండి సీమాంధ్రులను కట్టుబట్టలతో వెళ్లగొట్టే ప్రక్రియకు రాజ్యాంగేతర రాజకీయశక్తులు శ్రీకారం చుట్టాయి. ఈరోజు హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా ఎదిగింది. ఇందులో సీమాంధ్రుల స్వేదం వుంది. హైదరాబాద్ మాది అనే భావన ప్రతి ఆంధ్రుడిలో వుంది. ఉన్నఫళంగా ఈరోజు హైదరాబాద్‌తో మీకు సంబంధంలేదని చెప్పడమే కాంగ్రెస్ నీతా? ఈ దేశ సంస్కృతి, భాషలు, భావాలు పట్ల గౌరవం లేనివాళ్ల చేతుల్లో కాంగ్రెస్‌పార్టీ బానిసగా మారింది. ఆ పార్టీ నాయకులు టెన్‌జనపథ్‌కు ఊడిగం చేసే పనిలోవున్నారు. ఒక విదేశీవనిత మన మధ్యే చిచ్చు పెడుతుంది. ఇంతకంటే మనకు సిగ్గుచేటు వుంటుందా?

# హైదరా'బాధే'

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాన్ని రెండుగా చీలిస్తే చీల్చారు. రాజధాని నగరంలో మా వాటా ఏంటన్నదే సీమాంధ్రుల ప్రశ్న? 55ఏళ్లుగా హైదరాబాద్ నగరాభివృద్ధిలో పాలుపంచుకున్న సీమాంధ్రులకు ఈరోజు అందులో భాగం లేదంటే వూరుకోవడానికి చేతులకు గాజులు తొడుక్కుని లేమనేది వీరి వాదన.

సీమాంధ్రులు తెలివైనవాళ్లు, తెలంగాణవాళ్లు తెలివితక్కువ వాళ్లని కొందరంటుంటారు. ఈనాటి పరిస్థితులను చూస్తుంటే అది రివర్సనిపిస్తుంది. సీమాంధ్రవాళ్లు దగ్గర దృష్టిగలవాళ్లు, తెలంగాణవాళ్లు దూరదృష్టి వున్నోళ్లు. మొదట కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆ పరిస్థితి అలాగే వుండుంటే ఇప్పటికే కర్నూలు హైదరాబాద్‌ను తలదన్నేరీతిలో పెరిగివుండేది. కాని అప్పుడు హైదరాబాద్ రాష్ట్రం వాళ్లు తెలుగుభాషవాళ్లమందరం ఒక రాష్ట్రంగా వుందామని ప్రతిపాదించి ఇరుప్రాంతాలను కలిపి 1956లో ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసారు. పదవులకు వెంపర్లాడే తత్వం సీమాంధ్రులకు అప్పటినుండే వున్నట్లుంది. మొదట ముఖ్యమంత్రి పదవిని సీమాంధ్రులకు వదిలేసి రాజధానిని కర్నూలు నుండి హైదరాబాద్‌కు మార్చుకున్నారు. ఇక హైదరాబాద్ మనది అనే భావనతో సీమాంధ్రులు అక్కడ బాగానే పెట్టుబడులు పెట్టసాగారు. తెలంగాణ వాళ్లకు హైదరాబాద్ దగ్గర కాబట్టి అక్కడ పెట్టుబడులపై అంత ఆసక్తి వుండదు. అదీగాక వారికి వ్యాపార కార్యకలాపాలు తక్కువ. సీమాంధ్రులు ముఖ్యంగా కోస్తా ప్రాంతంవాళ్లు వ్యాపార, వాణిజ్య రంగాలలో ఆరితేరినవాళ్లు. హైదరాబాద్ అంతటా తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని కాకముందు హైదరాబాద్ నగరం ఒక సాధారణ పట్టణంగానే వుండేది. నిజాం నవాబు కట్టించిన భవనాలే అప్పట్లో చెప్పుకోదగ్గవి. ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా ఏర్పడ్డాక అందరు ముఖ్యమంత్రులు కూడా హైదరాబాద్ నగరాభివృద్ధికి విశేష కృషి చేసారు. దేశంలో అత్యంత అందమైన నగరాలలో హైదరాబాద్‌ను ఒకటిగా తీర్చిదిద్దారు. ఈ 55ఏళ్లలో రాష్ట్రంలోని మూడుప్రాంతాల ప్రజలు కట్టిన పన్నులతో, ప్రపంచబ్యాంకు నుండి తెచ్చిన అప్పులతో హైదరాబాద్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడం జరిగింది. ఈరోజు ఇంత స్థాయిలో అభివృద్ధి చేసిన నగరాన్ని వదులుకోమంటే సీమాంధ్రులకు గుండె మండదా? ఇప్పుడు హైదరాబాద్‌ను వదులుకోలేకే ఆందోళనలు చేస్తున్నారు. ఆరోజు తెలంగాణవాదులు భౌగోళికంగా తమకనువైన హైదరాబాద్‌లో రాజధానిని పెట్టుకుని తెలివిగా వ్యవహరించారు. సీమాంధ్రనేతలు సీఎం పదవికి ఒప్పుకుని ఈ తరం వారికి అన్యాయం చేసారు. చండీగఢ్ తరహాలో రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధాని చేసేందుకు భౌగోళికంగా హైదరాబాద్ అనువైంది కాదు. పంజాబ్, హర్యానాలకు మధ్యలో వుంది కాబట్టి చండీగఢ్ ఉమ్మడి రాజధానిగా ఉపయోగపడుతుంది. కాని హైదరాబాద్ తెలంగాణ ప్రాంతంలో వుంది. సీమాంధ్ర నుండి వెళ్లాలంటే తెలంగాణలో ఒకట్రెండు జిల్లాలను దాటుకు పోవాల్సి వస్తుంది. కేంద్రపాలిత ప్రాంతం చేయాలనే ఆప్షన్ వుందిగాని, అది కూడా అంత మంచిదికాదు.

దానికంటే కూడా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సూచించినట్లు దేశానికి హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయడం ఉత్తమం. ఢిల్లీకి పోయే పనిలేకుండా దక్షిణాది రాష్ట్రాల వారికి ఇదెంతగానో ఉపయోగపడుతుంది. అప్పుడైతే హైదరాబాద్‌ను వదిలి ఎవరూ ఎక్కడికీ పోవాల్సిన అవసరం వుండదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కొత్త రాజధానులను ఏర్పాటు చేస్తే ఏ సమస్యా వుండదు.

# హీరోలెవరు? జీరోలెవరు?

(2వ పేజీ తరువాయి)

నడిచింది. కాంగ్రెస్ నామమాత్రంగా మిగిలింది. కోవూరులో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో వైకాపా సర్పంచ్‌లు అధికసంఖ్యలో గెలిచారు. తెలుగుదేశం, కాంగ్రెస్‌లు వైకాపా వేగాన్ని అందుకోలేకపోయాయి. కాంగ్రెస్ అయితే మరీ దిగజారిపోవడం గమనార్హం. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్‌దే పైచేయి కాగా, వైకాపా కూడా ఓ మోస్తరుపోటీనిచ్చింది. తెలుగుదేశం మాత్రం ఇక్కడ అడ్రస్ లేకుండా పోయింది. గూడూరు నియోజకవర్గంలో కాంగ్రెస్, వైకాపాలు నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డాయి. తెలుగుదేశం ఎమ్మెల్యేగా బల్లి దుర్గాప్రసాద్ వున్నప్పటికీ ఆ పార్టీ మూడోస్థానానికి పోయింది. వెంకటగిరిలో తెలుగుదేశం ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ తన పట్టు నిలుపుకున్నాడు. పంచాయితీల వేటలో తెలుగుదేశాన్ని మొదటిస్థానంలో నిలబెట్టాడు. కాంగ్రెస్, వైకాపాలు టీడీపీకి సమంగా పోటీనిచ్చాయి. సూళ్లూరుపేటలో మాత్రం మూడు పార్టీలు సమంగా పంచాయితీలు గెలుచుకున్నాయి.

మొత్తానికి పంచాయితీ సమరంలో కొందరు పాతవాళ్లు వెనుకబడిపోగా, కొత్తగా ఆరంగేట్రం చేసిన మరికొందరు తమ సత్తా చాటడం విశేషం.

# పాత్రధారులే!

(మొదటిపేజీ తరువాయి)

మాకెటువంటి అభ్యంతరం లేదని వైకాపా ప్లీనరీలో చెప్పారు. ఇక రెండుకళ్ల సిద్ధాంతాన్ని నమ్ముకున్న చంద్రబాబు అయితే తెలంగాణ ఏర్పాటును కోరుతూ ఏకంగా కేంద్ర ప్రభుత్వానికే లేఖ వ్రాసారు. రాష్ట్ర విభజనను సీపీఎం, ఎంఐఎంలు గట్టిగా వ్యతిరేకిస్తే, బీజేపీ, సీపీఐలు తెలంగాణకు మద్దతు పలికాయి. మెజార్టీ పార్టీల అభిప్రాయం తెలంగాణకే అనుకూలంగా వుందనిచెప్పి కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది.

ఇప్పటికిప్పుడు తీసుకున్న విభజన నిర్ణయం స్వీయ ప్రయోజనాలకే! కాకపోతే ఇందుకు మిగతా పార్టీలను కూడా వాడుకుంది. వాళ్లకు నోరెత్తలేని పరిస్థితి కల్పించింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబు అయితే కాంగ్రెస్ నిర్ణయంతో అయోమయంలో పడ్డాడు. ఆయన ఇంత తొందరగా నిర్ణయం తీసుకుంటారని వూహించలేదు. విభజన నిర్ణయంతో ఆయన పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా అయ్యింది.

తెలంగాణకు మద్దతు తెలపడంద్వారా ఇరు ప్రాంతాలలోనూ మొదట నష్టపోతున్న పార్టీ తెలుగుదేశమే! తెలంగాణలో కేడర్ నిర్వీర్యమవుతోంది. ఇటు సీమాంధ్రలో ఆయన నిర్ణయం పట్ల వ్యతిరేకత పెరుగుతుంది. విభజన ప్రకటనకు ముందే వైకాపా నాయకులు తెలివైన నిర్ణయం తీసుకుని సమైక్యాంధ్రకు మద్దతుగా నిలిచారు. ఇప్పుడా పార్టీ తెలంగాణలో లేకపోయినా సీమాంధ్రలో బలంగావుంది. ఇక కాంగ్రెస్ రాష్ట్రం మొత్తం మీద గల్లంతు కావాల్సిన పరిస్థితుల నుండి బయటపడింది. సీమాంధ్రలో పార్టీ మీద ఆశ వదిలేసుకున్నా తెలంగాణలో గట్టిగా నిలబడబోతుంది. ఇక వామపక్షాల బలం అంతంతమాత్రమే. కొత్తగా అవి బలం పుంజుకోవడం గాని, బలం కోల్పోవడం గాని వుండదు. సీమాంధ్రలో అంతంత మాత్రంగా వున్న బీజేపీ ఇక కనుమరుగు కావచ్చు. అదే సమయంలో తెలంగాణలో బలపడే అవకాశాలున్నాయి.

మొత్తానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాష్ట్ర విభజనకు అన్ని పార్టీలు తలా ఒక చేయి వేసాయి. దీనికి ఫలితం ఎలావుంటుందో రేపటి ఎన్నికలే తేల్చాలి.

# జేసీస్ చేయూత



జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షులు యస్.రామకృష్ణ నెల్లూరు నగర పర్యటన సందర్భంగా ఈనెల 4వ తేదీన నెల్లూరు పప్పులవీధిలోని జేసీస్ భవన్‌లో "చార్టర్‌నైట్" కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షాఫలితాలలో 9పాయింట్లకుపైన సాధించిన బి.వి.నగర్‌లోని కెఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదుగురికి రామకృష్ణ ఒక్కొక్కరికి 1000రూ॥ల చొప్పున నగదు పురస్కారాన్ని అందించారు. జెసిఐ నెల్లూరుటౌన్‌ను నెల్లూరులో ప్రారంభించి 33సంవత్సరాలు అయిన సందర్భంగా గతించిన జేసీస్ పూర్వ అధ్యక్షులకు శ్రద్ధాంజలి ఘటించారు. 1983 నుండి సేవలందించిన పూర్వ అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. తదుపరి ఆత్మకూరు బస్టాండు దగ్గర ఫ్లైఓవర్ క్రింద నిద్రిస్తున్న పేదవారికి దుప్పట్లను అందించారు. కార్యక్రమంలో జేసీస్ నెల్లూరుటౌన్ అధ్యక్షులు తవ్వా శ్రీనివాసులు, కార్యదర్శి కె.వి.సురేష్‌బాబు, జూనియర్ జేసీ ఛైర్మెన్ హరికిషన్, జోన్ అధ్యక్షులు శంకర్, జోన్ వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, జోన్ ఏరియా ఆఫీసర్లు గుండపల్లి మధు, చింతాల మధుబాబు, జోన్‌డైరెక్టర్ శాంతి, జోన్ జేసీరేట్ ఛైర్‌పర్సన్ యోగవల్లి, కార్యదర్శి సునీతలక్ష్మి పాల్గొన్నారు.

# వాసవిక్లబ్ సేవా కార్యక్రమాలు




వాసవిక్లబ్ నెల్లూరు, వనిత క్లబ్ వారు ఈ నెల 4వ తేదీన నెల్లూరు పప్పులవీధిలో స్మైల్ డెంటల్ క్లినిక్ సహకారంతో ఉచిత దంతవైద్య శిబిరాన్ని నిర్వహించారు. దంతవైద్యులు వందమందికి దంత పరీక్షలు నిర్వహించి మందులు, పేస్ట్‌లు ఉచితంగా అందజేశారు. అలాగే ఆరోజు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దలకు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమాలలో క్లబ్‌కు చెందిన సి.వి.శరణ్‌కుమార్, సి.ఉమారాణి, డి.వెంకటేశ్వర్లు, రాజరాజేశ్వరి, మురళీకృష్ణ, పద్మావతి, పి.లక్ష్మి, రజని, వైష్ణవి, ప్రియ, భాగ్య, రాణి, వెంకటేశ్వర్లు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




## భవనము బాడుగకు కలదు

నెల్లూరు నగరం దర్గామిట్ట, సరస్వతీనగర్‌లోని జె.కె.రెడ్డి గారి ఇంటి ప్రక్కవీధిలో 6 అపార్ట్‌మెంట్లు కలిగిన భవనము అద్దెకు కలదు. బ్యాంకులు, కార్యాలయాలకు అనువైనది.

ఆసక్తికలవారు దిగువ నంబర్లనందు సంప్రదించగలరు.

☎: 0861 - 2323270, సెల్: 94402 78444



# గూడూరు డివిజన్ వార్తలు

## పోలీసు ఒక వ్యక్తి కాదు.. ఒక శక్తి!


గూడూరు డీఎస్పీ కె.చౌడేశ్వరి

గూడూరు డీఎస్పీ పరిధిలో 17మండలాలలో 380పంచాయతీలు ఉన్నాయి. అత్యంత సమస్యాత్మక 140గ్రామాలలో పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గూడూరు డీఎస్పీ కె.చౌడేశ్వరి ప్రతి గ్రామంలో తిరిగి ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చట్టాలను ప్రజలకు చెప్పి ఎలక్షన్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటును వినియోగించుకొనే విధంగా ప్రజలకు తెలియజేశారు. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికలకు ఇప్పటి పంచాయతీ ఎన్నికల నిర్వహణలో అత్యంత గుణాత్మకమైన బేధం కనిపిస్తుందని ప్రజలు 'లాయర్' దగ్గర అన్నారు. హోంగార్డు స్థాయి నుండి జిల్లా ఎస్పీ స్థాయి వరకు ఆయా గ్రామాలలో పర్యటించి సమస్యలు, శాంతిభద్రతలో విఘాతం కల్గించే వారిని గుర్తించి హెచ్చరించడం జరిగింది. సుమారు 6000మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసుకున్నట్లు ఎన్నికలలో యాభైవేలు లిక్కర్ బాటిల్స్ సీజ్‌చేసినట్లు 1500 చీరలు సీజ్‌చేసినట్లు తడలో మూడు లక్షల యాభైవేలు, రాపూరులో పదిహేనువేలు రూపాయలు సీజు చేశారని తెలిసింది.

గత పంచాయతీ ఎన్నికలలో మిట్టాత్మకూరు, పగడాలపల్లి మెట్టు, సైదాపురం, గ్రిద్దలూరు, కారూరు, చేనుగుంట, వీరంపల్లి, వెంకనపాళెం తదితర గ్రామాలలో గొడవలు జరిగాయని ప్రజలు తెలిపారు. ఇప్పుడు గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికలు జరుగుతున్న గ్రామాలలో ముందస్తుగా పర్యటించినట్లు వినికిడి. ఇకముందు కూడా ఆమె పరిధిలో ఉన్న ప్రాంతాలలో శాంతిభద్రతలు కాపాడుతారని గూడూరు ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఇక ముందు కూడా ఇంతే సమర్థవంతంగా పనిచేయాలని కోరుతూ వారికి "లాయర్" తరపున అభినందనలు తెలియపరుస్తున్నాం.

### సమైక్యాంధ్ర కోసం...

## ప్రాణత్యాగానికైనా సిద్ధం


కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

రాష్ట్రం సమైక్యంగా ఉండేందుకు ప్రాణత్యాగాలకైనా సిద్ధమని విద్యార్థి జెఏసి నాయకులు స్పష్టంచేశారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా గూడూరు పట్టణంలో ఆదివారంనాడు వివిధ సంఘాల ఆధ్వర్యాన ఆందోళనలు జరిగాయి. విద్యార్థి సంఘ నాయకులు, ట్రక్కు ఆటో కార్మికులు, ప్యాసింజర్ ఆటో కార్మికులు పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. సోనియా, కెసిఆర్ దిష్టిబొమ్మలను దగ్ధంచేశారు. గూడూరు పట్టణంలో జర్నలిస్టులు కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు.

కాగా సోమవారం నాడు స్థానిక టవర్‌క్లాక్‌సెంటర్‌లో సమైక్యాంధ్ర కోసం నినాదాలు చేశారు. సోనియా, కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బి.సి.సంక్షేమ సంఘం నాయకులు, నాయిబ్రాహ్మణ సేవాసంఘం నాయకులు, స్కూలు విద్యార్థులు, లిటిల్‌ఏంజెల్స్, సిరామిక్ కాలేజి, డిఆర్‌డబ్ల్యు కాలేజీ విద్యార్థులు, గూడూరు టి.వి.కేబుల్ ఆపరేటర్లు, తోపుడు బండ్ల వారు, మున్సిపల్ ఉద్యోగులు, జెఏసి నాయకులు కోడూరు మీరారెడ్డి, పాశంసునీల్‌కుమార్, నాసిననాగులు, దశరథ రామిరెడ్డి, కె.ఆర్.రెడ్డి, మస్తానయ్య రాజేంద్రప్రసాద్, మునిగిరీష్ మరియు గూడూరు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఆనిమెళ్ళ శివకుమార్, ఇసకపల్లి శివప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జునరావు, గిరి, సురేష్, వెంకటయ్య, బాబు, శ్రీను, శ్రీహరి, రామకృష్ణ, అల్తాఫ్, రసూల్, దుద్దా శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తూర్పు కనుపూరు ముత్యాలమ్మకు

## ప్రత్యేక పూజలు



చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం పంచామృతాభిషేకం గావించిన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు చుట్టుప్రక్కల ప్రాంతాలవారేకాక జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మహిళలు అమ్మవారి ఆలయ ఆవరణంలోని త్రిశూలానికి, రావిచెట్టుకు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీచేశారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

## గూడూరులో సమైక్యహోరు...


సోనియా, కేసీఆర్ దిష్టిబొమ్మలకు కర్మకాండలు చేస్తున్న సమైక్యవాదులు


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం


రహదారిపై వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


మానవహారంగా ఏర్పడ్డ డిఆర్‌డబ్ల్యు కళాశాల విద్యార్థినులు







## విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

### గూడూరు యస్.ఐ షేక్ షరీఫ్


విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేస్తున్న 1వపట్టణ ఎస్సై షేక్ షరీఫ్

దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఒకటవ పట్టణ ఎస్సై షేక్ షరీఫ్ అన్నారు. లయన్స్ క్లబ్‌వారు గూడూరు పట్టణంలోని దళితపాలెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు లయన్ జి.చంద్రశేఖర్ దాతృత్వంతో సోమవారం విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జాయింట్ ట్రెజరర్ కడివేటి చంద్రశేఖర్, కార్యదర్శి వి.రామ్మోహనరావు, ఏపిఆర్‌డీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ పాఠశాల కమిటీ వైస్‌ఛైర్మెన్ కె.వెంకటయ్య కోశాధికారి తన్నమాల లీలామోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# నాకు ఈ అవార్డు "పద్మశ్రీ"కన్నా గొప్పది

## - డా॥ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు సభలో శ్రీమతి శాంత సిన్హా





మాజీస్పీకర్ అగరాల ఈశ్వరరెడ్డిని సత్కరిస్తున్న జె.వి.రెడ్డి, ముంగమూరు

తనకు లభించిన పద్మశ్రీ అవార్డుతో పాటు అంతర్జాతీయంగా లభించిన ఇతర అవార్డులతో పోలిస్తే తన సొంతగడ్డపై అందుకున్న డా॥ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు చాలా గొప్పదిగా భావిస్తున్నానని పద్మశ్రీ శాంత సిన్హా తన ఆనందాన్ని నెల్లూరీయులతో పంచుకున్నారు. ఆగష్టు 4వ తేదీ టౌన్‌హాల్లో ఆమె ఈ అవార్డు అందుకున్నారు.

అశ్రితారెడ్డి, వెన్నెల-వినీల, గౌరీ మానస తదితరులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రారంభమైన అవార్డు ప్రదానోత్సవ సభకు మాజీ శాసనసభాపతి అగరాల ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. అవార్డు కమిటీ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు జె.వి.రెడ్డి, కొండా బలరామిరెడ్డిలతో పాటు నెల్లూరునగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, సీనియర్ న్యాయవాది పి.వి.రమణారెడ్డి, 'లాయర్' సంగ్రాహకుడు ప్రభు ఈ వేదుక వేదికపై వున్నారు.

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి కుమార్తె శ్రీమతి అనూరాధమ్మ ప్రగతి చారిటీస్ వారికి 75వేల రూపాయల విరాళాన్ని శ్రీమతి శాంత సిన్హా చేతులమీదుగా అంద జేశారు. ముందుగా స్వాగతోపన్యాసం చేసిన జె.వి.రెడ్డి అతిథులందరినీ పేరు పేరునా సభకు పరిచయం చేసి ఆహ్వానిం చారు. అగరాల ఈశ్వరరెడ్డి తన అధ్యక్షో పన్యాసంతో డాక్టర్ బెజవాడగోపాలరెడ్డితో తనకున్న అనుభవాలను, ఆయనపై తాను చేసిన పరిశోధన వివరాలను సభకు వివరించారు. గోపాలరెడ్డి గారి జీవితంపై తాను వ్రాసిన గ్రంథం "నోస్టాల్జియా"ను త్వరలో నెల్లూరులో విడుదల చేస్తా మన్నారు. గోపాలరెడ్డి గారు అటు రాజకీయవేత్తగా ఇటు సాహితీవేత్తగా రెండు రంగాలలోనూ తనదైన శైలిని చూపి గొప్ప వ్యక్తిగా రాణించారని సీనియర్ న్యాయవాది పి.వి.రమణారెడ్డి తన మాటలలో చెప్పారు.

నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలోనూ, బ్రిడ్జిస్కూళ్ల పటిష్టత కోసం పాటుపడడంలోనూ శ్రీమతి శాంత సిన్హా చూపిన ప్రతిభ అసమానమని నెల్లూరు ఆడపడుచుగా ఆమెను ఈరోజు గోపాలరెడ్డి గారి అవార్డుతో సత్కరించుకునే భాగ్యం కలగడం నెల్లూరీయుల అదృష్టమని అన్నారు. నెల్లూరుజిల్లా ఎప్పటికీ మరువలేని నేత డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డని ఆయన కీర్తించారు.

'లాయర్' ప్రభు తన ప్రసంగంలో బెజవాడ గోపాలరెడ్డి గారితో "లాయర్" పత్రికకి వున్న అనుబంధాన్ని గుర్తుచేసు కున్నారు. ఒక మహోన్నత వ్యక్తి పేరున ఏర్పాటుచేసిన అవార్డు మరో అసమాన ప్రతిభాశాలికి ఇవ్వడం సముచితమని అన్నారు.

వేదికపైవున్న ముఖ్యఅతిథులతో పాటు తనను సత్కరించడానికి వచ్చిన వారందరి ప్రశంసలను, పురస్కారాలనూ వాటితో పాటు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారి అవార్డును అందుకున్న పద్మశ్రీ శాంత సిన్హా ఆనందంతో తడిచిముద్దయ్యారు. తనకు ఈ గౌరవం లభించడం జీవితాంతం మరువలేనన్నారు. నెల్లూరుతో తనకున్న చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తనకు ఎన్నో అవార్డులు లభించినా ఈ అవార్డు తన బాధ్యతలను ఇంకా ఎక్కువ చేస్తుందని, తనని ఈ అవార్డుకు ఎంపిక చేసిన అవార్డు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలను తెలిపారు.

అవార్డు కమిటీ కార్యదర్శి బి.వి. నరసింహం కార్యక్రమాన్నంతా తన సహజ శైలిలో నిర్వహించడమే కాకుండా తానే స్వయంగా వ్రాసిన శ్రీమతి శాంత సిన్హా సన్మానపత్రాన్ని చదివి వినిపించారు. కొండా బలరామరెడ్డి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.




స్వర్గీయ బెగోరె కుమార్తె శ్రీమతి దేగా అనురాధ ప్రకటించిన 75వేల రూపాయల విరాళం చెక్కును ప్రగతి ఛారిటీస్ నిర్వాహకులకు అందజేస్తున్న శ్రీమతి శాంత సిన్హా

# అలరించిన సంగీత విభావరి



కె.రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న శ్రీ గురుకృప సంగీతవిద్యాలయం విద్యార్థినులు

త్యాగరాజ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో నిర్వహించిన శ్రీరామసేవ-పవళింపుసేవ సంగీత విభావరి సంగీత ప్రియులను విశేషంగా అలరించింది. నరసింహదాసు రచించిన శ్రీరామసేవ-పవళింపుసేవ కావ్యాలకు సంగీతాన్ని కూర్చి కీర్తనలు ఆలపించి ప్రేక్షకులను తన్మయత్వంలో ముంచారు. చిన్నారులు రాజ్యలక్ష్మి, మల్లాది అనూష, భవానీ, తేజశ్విని, శ్రీకళ తమ గాత్రంతో, మాచవోలు రమేష్‌శర్మ వ్యాఖ్యానంతో అందరిని ఆకట్టుకున్నారు. సంస్థ అధినేత్రి ఎ.లక్ష్మీప్రసన్న నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

# సోనియమ్మ వాకిట్లో సీమాంధ్ర గంజాయిచెట్లు



లోక్‌సభలో రాష్ట్ర విభజనపై రచ్చ జరుగుతుంటే తమకేమీ పట్టనట్లు కూర్చున్న సీమాంధ్ర కేంద్రమంత్రులు (వృత్తంలో చూపినవారు)

## సీమాంధ్ర ప్రజల గుండెల్లో విలన్‌లుగా మారిన కేంద్రమంత్రులు

రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ అధిష్టానం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీల నుండి పెద్దఎత్తున ప్రతిఘటన రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకుని తెలివిగా తెలంగాణ ప్రకటించింది. కాకులకు మెతుకులు విసిరినట్లుగా సీమాంధ్ర ఎంపీలకు కేంద్రమంత్రి పదవులు విసిరి, ఆ దిశగా నరుక్కుంటూ వచ్చింది. రాష్ట్ర విభజన విషయంలో ఈరోజు తెలంగాణ కేంద్రమంత్రులు, ఎంపీలు వారి ప్రాంతంలో హీరోలుగా నిలిస్తే, సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీలు మాత్రం ఇక్కడ ప్రజల దృష్టిలో జీరోలుగా, సీమాంధ్రద్రోహులుగా మిగిలిపోయారు. పదవుల కోసం కక్కుర్తిపడి ఓట్లేసిన ప్రజల నమ్మకాన్నే నిలబెట్టుకోలేని చరిత్రహీనులుగా నిలిచిపోతున్నారు. రాష్ట్ర విభజనలో ఓ పక్క సీమాంధ్ర తగలబడిపోతున్నా, ప్రజలు నిద్రాహారాలు మాని ఆందోళన చేస్తున్నా కనీసం వారి గురించి పట్టించుకోకుండా పదవులను పట్టుకుని వేలాడుతున్న వీరిని చూస్తుంటే జనం ఆవేశం కట్టలు తెంచుకుంటుంది. ఈ సమయంలో వారు ఎదురుగా కనిపిస్తే జనం ఏం చేస్తారో కూడా అర్థం కావడం లేదు. అంతగా రగిలిపోతున్నారు సీమాంధ్రులు.

తెలంగాణ వాళ్లు పదవుల కంటే ప్రత్యేక రాష్ట్రమే ముఖ్యమనుకున్నారు. కేంద్రమంత్రులు జైపాల్‌రెడ్డి, సర్వే సత్యనారాయణ, బలరాం నాయక్‌లతో పాటు తెలంగాణ ఎంపీలు కూడా ప్రత్యేకతెలంగాణ కోసం తీవ్రంగా పోరాడారు. తెలంగాణ ఇవ్వకుంటే పదవులకే కాదు కాంగ్రెస్‌ను కూడా వదిలిపోవడానికి సిద్ధపడ్డారు. వాళ్లు తెలంగాణ కోసం తెగించారు.

కాని సీమాంధ్ర ప్రజాప్రతినిధులలో అలాంటి తెగింపు లేదని కాంగ్రెస్ అధిష్టానం గ్రహించింది. అంతకుముందు సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కావూరి సాంబశివరావును కేంద్రమంత్రి పదవితో కొట్టింది. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగినా కూడా ఆయన నోరు విప్పడం లేదు. పదవితో ఆయన మౌనవ్రతం చేపట్టారు. చిరంజీవి సరేసరి... రాష్ట్రం ఏమైనా తగలబడనీ, హైదరాబాద్‌లో నా ఆస్తులు బాగుంటేచాలని, దానిని కేంద్రపాలిత ప్రాంతంగానో, ఉమ్మడి రాజధానిగానో చేయమని కోరుతున్నాడు. పురంధేశ్వరి అడ్రస్‌లేదు. తెలుగుజాతి ఖ్యాతిని నలుదిశలా చాటిన తెలుగుతేజం ఎన్టీఆర్ బిడ్డ ఆమె. ఈరోజు తెలుగుజాతి రెండుగా విడిపోతుంటే కనీసం ఇదేమని ప్రశ్నించడం లేదు. కిషోర్ చంద్రదేవ్, పల్లంరాజు, కిల్లి కృపారాణి పరిస్థితి కూడా అంతే. తొలిసారి వచ్చిన పదవిని నిలబెట్టుకోవాలనే తాపత్రయంతో ప్రజాగ్రహాన్ని కూడా పట్టించుకోవడం లేదు. పనబాక లక్ష్మి అయితే మరీఘోరం. విభజన జరుగుతున్నది తన రాష్ట్రంలో కాదులే అన్నట్లుగా వుంది. జె.డి.శీలం కూడా పదవికి అమ్ముడుపోయి సీమాంధ్రకు ద్రోహం చేసాడు. సీమాంధ్ర ఎంపీలు సైతం రాష్ట్ర విభజనను అడ్డుకోవడంలో సమర్థవంతంగా వ్యవహరించలేక ఈరోజు సీమాంధ్రప్రజల దృష్టిలో విలన్‌లయ్యారు. పదవులే శాశ్వతమనుకుంటున్న వీళ్లు రేపు ప్రజలముందుకు ఏం ముఖంపెట్టుకుని వస్తారో?






Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.